ఆదివారం
20-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 60
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

తైవాన్ పరిసరాల్లో చైనా సైనిక విన్యాసాలు

తైవాన్ ద్వీపకల్పం పరిసరాల్లో చైనా సైనిక విన్యాసాలు చేపట్టింది. నావికా, వైమానిక దళాలతో సైనిక విన్యాసాలు, సీ పెట్రోలింగ్‌ను చైనీస్ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ, ది ఈస్టరన్ థియేటర్ కమాండ్ శనివారం నిర్వహించింది. ఈ మేరకు కమాండ్ అధికార ప్రతినిధి షియీ తెలిపారు.

2 లో

ఉల్లి ఎగుమతులపై 40 శాతం సుంకం

వెంటనే అమల్లోకి..

న్యూదిల్లీ: ఉల్లి ధరలను నియంత్రించడం ద్వారా దేశీయంగా సరఫరా పెంచాలని కేంద్రం యోచిస్తోంది. ఇందుకోసం ఉల్లి ఎగుమతులపై 40 శాతం సుంకం విధించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని ఆర్థిక శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. డిసెంబర్ 31 వరకు సుంకం అమల్లో ఉంటుందని తెలిపింది. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు ఆర్బీఐతో కలిసి యత్నిస్తున్న ప్రభుత్వం... పెరిగిన బియ్యం ధరల నియంత్రణ కోసం వాటి ఎగుమతులపై నిషేధం విధించింది. సెప్టెంబర్‌లో ఉల్లి ధరలూ పెరుగుతాయన్న అంచనాలతో ముందస్తు చర్యలు చేపట్టింది. బఫర్ స్టాక్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. తాజాగా ఉల్లి ఎగుమతులను తగ్గించేందుకు సుంకాన్ని కేంద్రం విధించింది.

నేటి నుంచి టమాటా కిలో రూ.40

2 లో

వైసీపీకి మరో ఎదురుదెబ్బ

పంచాయతీ ఉప ఎన్నికల్లో ఘోర పరాభవం

అధికారబలం ప్రయోగించినా కానరాని ఫలితం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలోని వివిధ గ్రామ పంచాయతీ, వార్డులకు జరిగిన ఉపఎన్నికల్లో అధికారపార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. రెండేళ్ల క్రితం జరిగిన స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్వీప్ చేయగా, శనివారం నాటి ఉప ఎన్నికల్లో ఎక్కువస్థానాల్లో అధికారపార్టీ బలపర్చిన అభ్యర్థులకు పరాభవం ఎదురైంది. గతంలో శాసనమండలి గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికల్లో అధికారపార్టీకి పరాభవం జరిగినట్లే... తాజాగా జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లోనూ వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనపడింది. రాష్ట్రవ్యాప్తంగా 34 గ్రామ పంచాయతీలు, 245 వార్డులకు ఉప ఎన్నికలు నిర్వహించారు. పోలింగ్ పూర్తికాగానే ఓట్లు లెక్కింపు జరిగింది. అనేకచోట్ల వైసీపీకి టీడీపీ గట్టి షాక్ ఇచ్చింది. టీడీపీ బలపర్చిన అభ్యర్థులు చాలా చోట్లా విజయం సాధించారు. గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో భారీ మెజార్టీతో టీడీపీ సర్పంచ్ గెలుపొందారు. గుంటూరు, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, కడప, కృష్ణా జిల్లాల్లో అధిక సంఖ్యలో టీడీపీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు విజయం సాధించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీ హవా కొనసాగింది. సింగరాయకొండ మండలం పాకలలో టీడీపీ మద్దతు అభ్యర్థి సైకం చంద్రశేఖర్ సర్పంచ్‌గా విజయం గెలుపొందారు. కొత్తపట్నం మండలం అల్లూరులో నాలుగో వార్డు, సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పదో వార్డు, కనిగిరి మండలం గురవాజీపేట 2వ వార్డు, పిసిపల్లి మండలం గుంటుపల్లి 3వ వార్డు, సీఎస్ పురం మండలం చెన్నపునాయునిపల్లి 6వ వార్డు, చీమకుర్తి మండలం మంచికలపాడు 1వ వార్డు, లింగసముద్రం మండలం చినపవని 2వ వార్డు, ఉలవపాడు మండలం ఆత్మకూరు 5వ వార్డు, టంగుటూరు మండలం పొందూరు 1వ వార్డులో టీడీపీ మద్దతు అభ్యర్థులు గెలుపొందారు. కొండేపి నియోజకవర్గం పాకల పంచాయతీలో టీడీపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి 260 ఓట్లతో ఘన విజయం సాధించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 4వ వార్డులో వైసీపీ అభ్యర్థికి కేవలం 10 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థికి 134 ఓట్లు లభించాయి. ఇక గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని గుండవరం పంచాయతీ ఎన్నికల్లో జనసేన అభ్యర్థి 15 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. చింతపల్లి మండలంలోని కుడుముసారి పంచాయతీ 9వ వార్డులో టీడీపీ అభ్యర్థిని పొంగి లీలావతి 7 ఓట్లతో వైసీపీ అభ్యర్థిపై గెలుపొందారు. హిందూపురం నియోజకవర్గం లేపాక్షి మండలం పూలమతి పంచాయతీ 10వ వార్డు ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కె.నవీన్ 16 ఓట్లతో విజయం సాధించారు. కొండాపురం మండలం సాయిపేట 3వ వార్డు టీడీపీ అభ్యర్థి సానంగుల రవీంద్ర 65 ఓట్లతో గెలుపొందారు. జలదంకి మండలం లింగరాజు అగ్రహారం సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మంగళ తిరుమల 88 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఆముదాల వలస నియోజకవర్గ పరిధిలోని బొప్పాడం, నాగారం వార్డుల్లోనూ టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు.

ప్రొద్దుటూరు మండలం రాజుపాలెం పంచాయతీలోని 9వ వార్డులో టీడీపీ అభ్యర్థి పెరుమాళ్ల ఓబులేసు గెలుపొందారు. తణుకు నియోజకవర్గంలో కావాలిపురం సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వనచర్ల అప్పన్నస్వామి 164 ఓట్ల మెజార్టీతో ప్రత్యర్థిని చిత్తు చేశారు. టెక్కలి నియోజక వర్గం నందిగాం అన్నాపురం పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో మాత్రం వైసీపీ అభ్యర్థి ఇంద్రవేణి 89 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. టెక్కలి మండలం నర్సింగపల్లి వార్డు వైసీపీ అభ్యర్థి 100 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. మునుబోలు మండలం బండేపల్లి మూడో వార్డులో వైసీపీ అభ్యర్థి కేవలం ఒక్క ఓటుతో గెలుపొందారు. చేజర్ల మండలం పాతపాడులో సమాన ఓట్లు రాగా, లాటరీలో వైసీపీ అభ్యర్థిని విజయం వరించింది. మొత్తానికి రాత్రి పొద్దు పోయే వరకు అందిన ఫలితాల్లో 14 సర్పంచ్ స్థానాల్లో టీడీపీ 9, ఒక స్థానంలో జనసేన పార్టీ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించగా, అత్యధిక వార్డు స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. పోలింగ్ సందర్భంగా వైసీపీ నేతలు తమ అధికారాన్ని విస్తృతంగా ప్రయోగించినప్పటికీ ఫలితం దక్కలేదు.

ఓటు ద్వారా వేటు వేశారు: అచ్చెన్నాయుడు

జగన్‌మోహన్ రెడ్డి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్న విషయం పంచాయతీ ఉప ఎన్నికల ఫలితాల ద్వారా బట్టబయలైందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ నేతల అరాచకం, అధికార గణాన్ని అడ్డుపెట్టుకుని అనేక ప్రతిబంధకాలు సృష్టించినా టీడీపీ అభ్యర్థులు మొక్కవోని ధైర్యంతో పోరాడి విజయం సాధించారని చెప్పారు. జగన్ అరాచక, అవినీతి, రైతు వ్యతిరేక విధానాలకు, బడుగు బలహీన వర్గాల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసినందుకు ఓటు ద్వారా ప్రజలు వైసీపీకి వేటు వేశారన్నారు. తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులకు అండగా నిలబడ్డ అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న సార్వత్రిక సంగ్రామంలోనూ రెట్టింపు ఉత్సాహంతో, మొక్కవోని ధైర్యంతో, ఈ అరాచక పాలనకు చరమగీతం పాడాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

'గ్రూప్' పరీక్షల ఫీవర్

మళ్లీ సిలబస్ మార్పు
ఏపీపీఎస్సీ సన్నద్ధం
అభ్యర్థుల గందరగోళం
త్వరలో గ్రూప్-1, 2 ప్రకటనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించే గ్రూప్ 1, 2 పరీక్షల సిలబస్ మార్పునకు రంగం సిద్ధమైంది. రాబోయే నోటికేషన్ల నుంచి నూతన సిలబస్ అమలులోకి రానుంది. ప్రస్తుతమున్న సిలబస్‌తోపాటు అదనంగా కొన్ని అంశాల్ని జోడించడం, మరికొన్నింటిని తొలగించడం వంటి ప్రక్రియలో ఏపీపీఎస్సీ నిమగ్నమైంది. గ్రూప్ -1 ఫలితాల ప్రకటన సమయంలో చైర్మన్ గౌతమ్ సవాంగ్ ఈ విషయాన్ని వెల్లడించడంతో అభ్యర్థుల సన్నద్ధతపై నీళ్లు చల్లినట్లయింది. యూపీఎస్సీ తరహాలో గ్రూప్ సిలబస్‌ను మరింతగా పటిష్టవంతం చేయడం, పోటీ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడానికి సమాయత్తమైంది. వాస్తవంగా గ్రూప్-1, 2కు ఇప్పటికే సిలబస్ విస్తృతంగా ఉంది. గ్రూప్-1 ఉద్యోగాలకు ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ

- మిగతా 2 లో

సుజల స్రవంతితోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

- రివర్స్ గేర్ ప్రభుత్వంతో రాష్ట్రం అధోగతి
- మోదీది సీబీఐ రాజ్యం... జగన్‌ది పోలీసు రాజ్యం
- రాజకీయాలకతీతంగా అన్నిపక్షాలు ఏకం కావాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

8 లో

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాధించకుండా ఉత్తరాంధ్ర అభివృద్ధి జరగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. 'రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' నినాదంతో ప్రారంభమైన బస్సు యాత్ర శనివారం అనకాపల్లి చేరుకుంది. జిల్లా కేంద్రంలో గల సుంకరమెట్ట జంక్షన్ వద్ద నుంచి బస్సు యాత్రకు పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు.

నిష్పాక్షిక ఎన్నికలకు తూట్లు

- స్వేచ్ఛ, పారదర్శక పద్ధతికి స్వస్తి
- రాజ్యాంగ సభ ఉద్దేశానికి తూట్లు
- తగ్గిపోతున్న ఈసీల స్థాయి
- ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లుతో సర్కార్‌కు ఈసీఐ దాసోహం
- సంస్కరణల నెపంతో ప్రభుత్వం గుప్పెట్లో సర్వాధికారాలు

న్యూదిల్లీ: ఎన్నికల సంఘాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి మోదీ సర్కారు కుట్రకు పాల్పడుతోంది. అందులో భాగంగా ఎన్నికల కమిషనర్ల నియామకాలపై సర్వాధికారాలు కేంద్రానికి కట్టబెట్టేలా ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లు తెరపైకొచ్చింది. దీంతో నిష్పాక్షిక, స్వేచ్ఛ, పారదర్శక ఎన్నికల ప్రక్రియకు స్వస్తి పలికాల్సి రావచ్చన్న సంకేతాలు వెలువడ్డాయి. మోదీ సర్కార్ తీసుకొచ్చిన బిల్లు ద్వారా భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) సర్కార్ హస్తగతం కాబోతోంది. రాజ్యాంగ వ్యవస్థగా కాకుండా అధికార యంత్రాంగంగా ఇది మారిపోనున్నట్లు కొత్త బిల్లు సూచిస్తోంది. ఈసీల స్థాయి కూడా కేబినెట్ కార్యదర్శి హోదాతో సమానం కాబోతోంది. ఈ పరిస్థితుల్లో సర్కార్‌కు ఈసీఐ దాసోహం కావడమే తరువాయిగా ఉంది. సంస్కరణల నెపంతో సర్వాధికారాలు తమ వద్ద ఉంచుకొని ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తూ ఏకఛత్రాధిపత్యాన్ని సాగించాలని మోదీ సర్కార్ భావిస్తోంది. అనేక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలతో పాటు వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మళ్లీ అధికారంలోకి రావడమే ధ్యేయంగా పావులు కదుపుతోంది. అధికార పార్టీ రాజకీయ ఆగడాలకు అడ్డాగా భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) మారిపోవచ్చు. బిల్లులోని సెక్షన్ 10 ప్రకారం సీఈసీ, ఈసీల హోదా సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థాయి నుంచి కేబినెట్ కార్యదర్శి స్థాయికి పడిపోతుంది. ఈసీఐ... రాజ్యాంగ వ్యవస్థ నుంచి ఎగ్జిక్యూటివ్ అథారిటీగా మారిపోయేందుకు దారి తీస్తుంది. ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిపేందుకు హామీ ఇవ్వడానికి బదులు ప్రధానమంత్రి ఇష్టానికి ఈసీఐ లొంగిపోయే విధంగా బిల్లు ఉండటంతో ఎన్నికల కమిషన్ ఏర్పాటు ఉద్దేశమే నీరుకారిపోయే

- మిగతా 2 లో

బియ్యం మాయాజాలం

పుట్టగొడుగుల్లా అన్ బ్రాండెడ్ బియ్యం

- సూపర్ ఫైన్‌లో మామూలు బియ్యం కలిపేస్తున్న వైనం
- పేరు మార్చేసి... ఎమ్మార్పీ అధికంగా వేసి విక్రయాలు
- ఉమ్మడి గోదావరి జిల్లాలో వ్యాపారుల అడ్డదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు : రాష్ట్రంలో బియ్యం అక్రమ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్రత్యేకించి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. బియ్యం వ్యాపారంలో ఆరితేరిన రైస్ మిల్లర్లు సూపర్ ఫైన్ బియ్యం విక్రయాలలో అడ్డదారులు తొక్కుతున్నారు. వేల కొలది క్వింటాళ్ల మామూలు బియ్యాన్ని సూపర్ ఫైన్ బియ్యంగా మార్చి అక్రమార్జనతో రెండు చేతులా డబ్బులు సంపాదిస్తున్నారు. దొరికితే దొంగ అన్న చందంగా చాప కింద నీరులా వ్యాపారం నిరాటంకంగా సాగుతోంది. సూపర్ ఫైన్ బియ్యంలో కర్నూలు రైస్‌కు మంచి గిరాకీ ఉంటుంది. దీనిని అవకాశంగా తీసుకున్న కొంతమంది రైస్ మిల్లర్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నం.1 కర్నూలు రైస్ పేరుతో దందా సాగిస్తున్నారు. ఏ రైస్ ఏ మిల్లులో తయారవుతున్నాయో వారి పరిశ్రమ పేరుతోనే బియ్యం వ్యాపారాన్ని సాగించాల్సి ఉంది. కానీ ప్రజలను ఏమార్చి కర్నూలు రైస్ పేరుతో దందా సాగిస్తున్నారు. లోకల్ బ్రాండ్ ఉన్న 25 కిలోల బియ్యం బస్తాను రూ.1,200 కు విక్రయిస్తుండగా కర్నూలు రైస్ బ్రాండ్‌తో ఉన్న 25 కిలోల ఫైన్ బియ్యాన్ని రూ.1,500 కు విక్రయిస్తున్నారు. స్థానికంగా తయారైన వాటినే కర్నూలు రైస్ పేరుతో సూపర్ ఫైన్ బియ్యంగా విక్రయించి అదనంగా రూ.300 వినియోగదారుడు వద్ద నుంచి దోచుకుంటున్నారు. మామూలు బియ్యాన్ని ఆకర్షణీయమైన సంచులలో నింపుతూ బ్రాండెడ్ కంపెనీకి చెందిన వినియోగదారులకు అంటగడుతున్నారు. వ్యాపారులు తాము అమ్మేవే నాణ్యమైనవిగా నమ్మిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇక్కడ ఏళ్ల తరబడి స్థానికంగా తయారైన బియ్యాన్ని బ్రాండెడ్ పేరుతో జోరుగా విక్రయిస్తున్నారు. జిల్లాలోని అనేక ప్రాంతాలలోని రైస్ మిల్లులలో లభించే బియ్యాన్ని వ్యాపారులు ప్యాక్ చేస్తున్నారు. వీటిని బ్రాండెడ్ పేర్లు, ఎంఆర్‌పీ అధికంగా ముద్రిస్తూ రిటైల్ వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు. వీటిపై ముద్రించిన ధరలకే వినియోగదారులకు విక్రయిస్తున్నారు. నాణ్యత పేరుతో ధరలను మరింత పెంచుతూ వినియోగదారులను దోపిడీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

పాకిస్తాన్‌లో మైనారిటీలకు రక్షణ లేదు

చర్చీలు, క్రైస్తవులపై దాడులకు పాక్ కమ్యూనిస్టు పార్టీ ఖండన

2 లో

స్థాయీ సంఘానికి సాక్ష్యం చట్టాలు

రాజ్యసభ చైర్మన్ ధన్కర్ సిఫార్సు

యువగళం @ 2500 కి.మీ.

మంగళగిరిలో 20 వేల ఇళ్ల నిర్మాణానికి శిలాఫలకం

విజయవాడ ప్రకాశం బ్యారేజీపై లోకేశ్‌కు ఘన స్వాగతం

2 లో

తైవాన్ పరిసరాల్లో చైనా సైనిక విన్యాసాలు

నాన్‌జింగ్: తైవాన్ ద్వీపకల్పం పరిసరాల్లో చైనా సైనిక విన్యాసాలు చేపట్టింది. నావికా, వైమానిక దళాలతో సైనిక విన్యాసాలు, సీ పెట్రోలింగ్‌ను చైనీస్ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ, ది ఈస్టరన్ థియేటర్ కమాండ్ శనివారం నిర్వహించింది. ఈ మేరకు కమాండ్ అధికార ప్రతినిధి షియా తెలిపారు. సైనిక నౌకలు, విమానాల మధ్య సమన్వయంలో శిక్షణ, యుద్ధమొచ్చినప్పుడు సముద్రం, గగనతలంపై నియంత్రణ, సాయుధ సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ విన్యాసాల ఉద్దేశమని అన్నారు. తైవాన్ విషయంలో జోక్యం చేసుకునే వారికి ఇవి హెచ్చరిక అని కూడా షియా తెలిపారు. తైవాన్ ఉపాధ్యక్షుడు విలియన్ లాయి అమెరికా పర్యటనపై చైనా గుర్రుగా ఉంది. తైవాన్ తమ భూభాగమని, దానిని ఎప్పటికైనా కలుపుకుంటామని చైనా చెబుతోంది. తైవాన్ విషయంలో జోక్యం చేసుకోవద్దని పశ్చిమ దేశాలకు ముఖ్యంగా అమెరికాకు స్పష్టంచేసింది. అయితే చైనా వైఖరిని తైవాన్ వ్యతిరేకిస్తోంది. తాజా సైనిక విన్యాసాలను ఆ దేశ రక్షణశాఖ ఖండించింది. ప్రతిఘటిస్తామని హెచ్చరించింది.

పాకిస్తాన్‌లో మైనారిటీలకు రక్షణ లేదు

చర్చీలు, క్రైస్తవులపై దాడులకు పాక్ కమ్యూనిస్టు పార్టీ ఖండన

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో మైనారిటీలకు రక్షణ లేదని, క్రైస్తవులపై, చర్చీలపై దాడులు పెరుగుతున్నాయని పాకిస్తాన్ కమ్యూనిస్టు పార్టీ వ్యాఖ్యానించింది. ఇటీవల జరన్‌వాలాలో క్రైస్తవులు, చర్చీలపై దాడులను ఖండించింది. హింసను ఆపాలని ఆ దేశ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మైనారిటీలపై హింసను నియంత్రించడంలో పాక్ ప్రభుత్వం విఫలమవుతోందని, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయని, దోషులపై చర్యలు కరువయ్యాయని దుయ్యబట్టింది. మతాధారంగా దేశ విభజన జరిగినప్పుడు విద్వేష బీజాలు నాటబడ్డాయని, వాటిని అమెరికా సహకారంతో నియంతలు పెంచారని, ఇప్పుడు ఆ విష ఫలాలు పాకిస్తాన్‌ను అట్టుడికిస్తున్నాయని వ్యాఖ్యానించింది.

షియా, అహ్మదీల గొడవులు, హిందువులు, క్రైస్తవులపై హింసను కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కిచెప్పింది. పాకిస్తాన్ రాజ్యాంగం, చట్టాలు, విద్య వ్యవస్థ అన్నీ కూడా లౌకిక, ఆధునిక శాస్త్రీయ మూలాలతో ఉన్నాయిగానీ అవి సక్రమంగా అమలు కావడం లేదని పేర్కొంది. అందరికీ సమాన హక్కులు, హోదాకు హామీనిచ్చే చట్టాలు ఉన్నాగానీ మానవతా సంక్షోభం, విద్వేషాలకు పరిష్కారం లభించడం లేదని పేర్కొంది. పాకిస్తాన్‌ను సరైన మార్గంలోకి తేవడం చేరుకోలేని లక్ష్యంగా పరిణమిస్తోందని పాకిస్తాన్ కమ్యూనిస్టు పార్టీ ఆందోళన వ్యక్తంచేసింది.

స్వీడన్ పర్యటనలో జెలెన్‌స్కీ

కీవ్: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ శనివారం స్వీడన్‌లో పర్యటించారు. ఆయన స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెరస్సన్, రాజ కుటుంబంతో పాటు ఇతర అధికారులతో భేటీ కానున్నారు. మూడు నెలలుగా తమ దేశంపై రష్యా దాడుల నేపథ్యంలో మద్దతును కూడకట్టే పనిలో జెలెన్‌స్కీ ఉన్నారు. ఉక్రెయిన్‌కు మద్దతిస్తున్నందుకు స్వీడన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భూమిపైనే కాదు గగనతలంలోనూ ఉక్రెయిన్ యోధులకు మరింత బలం చేకూర్చడమే లక్ష్యమని, ద్వైపాక్షిక సహకారాన్ని పెంచుకోవాలని భావిస్తున్నారు. ఉక్రెయిన్ యూరోపియన్ ఇంటిగ్రేషన్, యూరో-అట్లాంటిక్‌లో భద్రతా నేపథ్యంలో సమన్వయాన్ని మరింత పెంచుకోవాలని జెలెన్‌స్కీ ఆకాంక్షించారు. టెలిగ్రామ్ ద్వారా స్వీడన్ చేరుకున్నట్లు ప్రకటించారు. 314.5 మిలియన్ డాలర్ల కొత్త సైనిక మద్దతు ప్యాకేజిని ఉక్రెయిన్ కోసం సీడెన్ రక్షణ శాఖ ఈమధ్య ప్రకటించింది. స్వీడన్ నుంచి ఉక్రెయిన్‌కు ఇది 13వ ప్యాకేజి. జెలెన్‌స్కీ పర్యటనపై స్వీడన్ వర్గాలు ఇంకా స్పందించలేదు.

ఉక్రెయిన్‌కు అమెరికా దానిష్ యుద్ధవిమానాలు

వాషింగ్టన్ : రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు అగ్రరాజ్యం అండగా నిలుస్తోంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి అమెరికాతో పాటు దాని మిత్రదేశాలు కలిసి ఉక్రెయిన్‌కు ఆయుధ, సైనిక సహకారాన్ని అందిస్తూ వచ్చాయి. తాజాగా దానిష్ ఎఫ్-16 ఫైటర్ జెట్లను ఉక్రెయిన్‌కు పంపేందుకు అమెరికా నిర్ణయించింది. దానిష్ జెట్లను నడపడానికి ఆ దేశ పైలెట్ల శిక్షణ పూర్తి అయిన తర్వాత యుద్ధ విమానాల తరలింపునకు సంబంధించి డెన్మార్క్, నెథర్లాండ్స్‌కు అనుమతి ఇవ్వనున్నట్లు వాషింగ్టన్ వర్గాలు తెలిపాయి. ఉక్రెయిన్ పైలెట్లకు ఎఫ్-16 విమానాలను నడపడానికి డెన్మార్క్, నెథర్లాండ్స్ శిక్షణ ఇస్తున్నాయి. పైలెట్ల శిక్షణ పూర్తి అయితే ఉక్రెయిన్ సామర్థ్యం మరింత పెరుగుతుందని అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు.

బియ్యం మాయాజాలం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్‌లో బియ్యం ధరలు ఊహించని విధంగా పెరగడంతో సామాన్యులు కడుపునిండా భోజనం చేయాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది.

సూపర్ ఫైన్ బియ్యంలో మిక్సింగ్

స్థానిక బ్రాండ్ పేరుతో సూపర్ ఫైన్ బియ్యం విక్రయిస్తున్నారు. అయితే అందులో ఇతర బియ్యాన్ని కూడా కలిపేస్తున్నారు. వాస్తవానికి సూపర్ ఫైన్ బియ్యం తయారు చేయాలంటే బీపీటీ ధాన్యంతో పాటు రబీలో దిగుబడి వస్తున్న హెచ్‌ఎంటీలతో పాటు మరికొన్ని రకాలను వినియోగించాల్సి ఉంటుంది. కానీ ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్న సాధారణ రకం ధాన్యాన్ని బియ్యంగా మార్చి సూపర్ ఫైన్‌లో మిక్సింగ్ చేస్తున్నారు. 25 కేజీల బస్తాకు రూ.1,600 వెచ్చించి కొనుగోలు చేస్తున్న వినియోగదారులు మిక్సింగ్ బియ్యం తినాల్సి వస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం సైతం పక్క దారిన పడుతున్నాయి. గతంలో జిల్లా నుంచి రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి రావులపాలెం మీదుగా కాకినాడ పోర్టుకు తరలిస్తున్న లారీలను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టుకోవడంతో ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. కొందరు వ్యాపారులు దొడ్డు బియ్యాన్ని సన్నరకంలో కలిపి విక్రయిస్తున్నారని, మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ఆహార అలవాట్లలో ప్రధానమైన బియ్యం ధరలు పెరగడంతో పేద ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 40 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. ప్రతిరోజు పెద్ద మొత్తంలో సన్నబియ్యాన్ని వినియోగిస్తున్నట్లు అంచనా. క్వింటాలుకు రూ.500 అదనంగా విక్రయిస్తుండడంతో లక్షల్లో రూపాయల మేర వినియోగదారులపై అదనపు భారం పడుతుంది. జిల్లాలో హోల్‌సేల్‌గా ఉన్న బియ్యం బ్రాండ్ ఒక్కటీ లేదని ఆయా శాఖల అధికారులు పేర్కొంటున్నారు. కనీసం బ్రాండ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నవీ ఏవీ లేవని అధికారులు చెబుతున్న సమాచారం. మార్కెట్‌లోకి మాత్రం వివిధ రకాల పేర్లతో పదుల సంఖ్యలో బ్రాండ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆకర్షణీయంగా సంచులు తయారు చేసి నాణ్యమైన బియ్యం అంటూ వినియోగదారులకు అంటగడుతున్నారు. నిబంధనల ప్రకారం బియ్యాన్ని విక్రయించాలి. ఉల్లంఘన జరిగితే కేసు నమోదు చేయవలసి ఉంటుంది. నిబంధనల ప్రకారం క్వాలిటీ బియ్యాన్ని కిలో రూ.40 మించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించకూడదు. ఇది ఎక్కడా కూడా అమలు కావడం లేదు. వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు ధరలు నిర్ణయించి అమ్మకాలు చేపడుతున్నారు. సంస్థలపై ధర ప్యాకింగ్ ముద్రించాల్సి ఉంటుంది. కానీ ఏ ఒక్కరూ దీనిని అమలు చేయడం లేదు.

భారీగా అక్రమ నిల్వలు

జిల్లాలో రైస్ మిల్లులలో భారీగా బియ్యం అక్రమ నిల్వలు ఉన్నట్లు సమాచారం. పంట దిగుబడి తగ్గితే మార్కెట్‌లో డిమాండ్ పెరగడం సాధారణం. ఇదే అదునుగా భావిస్తున్న వ్యాపారులు బియ్యం నిల్వలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఫిర్యాదులు అందినప్పుడు నామమాత్రం దాడులు చేసి ఆ తరువాత పట్టించుకోవడంలేదని, వ్యాపారుల అక్రమాలకు అదుపు లేకుండా పోతోందని ప్రజలు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి బియ్యం అక్రమ నిల్వలను నియంత్రించి, పెరుగుతున్న ధరలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యువగళం @ 2500 కి.మీ.

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, అరాచక పాలనపై సమరభేరి మోగిస్తూ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పేరుతో ప్రారంభించిన పాదయాత్ర శనివారం మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో 2,500 కి.మీ.ల మైలురాయి చేరుకుంది. ఈ సందర్భంగా అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ఇళ్లు లేని 20 వేల మంది నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తానని హామీ ఇస్తూ నారా లోకేశ్ అక్కడ శిలాఫలకం ఆవిష్కరించారు. దీంతోపాటు అసైన్డ్, కొండ, వాగు, అటవీ, రైల్వే, ఇతర భూముల్లో నివసిస్తున్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించి పట్టాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లాలో పాదయాత్ర ముగించుకుని ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ప్రవేశించిన లోకేశ్‌కు ప్రకాశం బ్యారేజీ వద్ద తెలుగు తమ్ముళ్లు వేలాది మంది తరలివచ్చి భారీ స్వాగతం పలికారు. జగన్ సైకోయిజానికి ప్రత్యక్ష సాక్షి ఉండవల్లిలోని ప్రజావేదిక అని, అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో 2019 జూన్ 25న మొదలైన కూల్చివేతల పర్వం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. 51 నెలల రాక్షస పాలనలో గూడు కోల్పోయిన లక్షలాది పేదల కన్నీరు దావానలంగా మారుతోంది. ఏ విధ్వంసంతో నువ్వు పాలన ప్రారంభించావో అక్కడి నుంచే నీ పతనం ప్రారంభం కాబోతోంది... ఈ ప్రజావేదిక శిథిలాలే మరో 9 నెలల్లో నీ అరాచక ప్రభుత్వానికి సమాధిరాళ్లు కాబోతున్నాయి... రాసి పెట్టుకో జగన్‌మోహన్ రెడ్డీ? అంటూ ఉండవల్లి వద్ద ప్రజావేదికను కూల్చివేతను చూపిస్తూ సెల్ఫీ ఫొటోను లోకేశ్ మీడియాకు విడుదల చేశారు. కొండవీటి వాగు వద్ద బోట్ అసోసియేషన్ ప్రతినిధులు స్వాగతం పలికారు. వైసీపీ ప్రభుత్వంలో తాము నష్టపోయిన తీరును వివరిస్తూ గజమాల ఏర్పాటు చేశారు. తమకు పూర్వవైభవం తీసుకొచ్చే చర్యలు తీసుకోవాలంటూ కృష్ణానదిలో పడవల ప్రదర్శన నిర్వహించారు. ప్రకాశం బ్యారేజి వద్ద ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలు వీడ్కోలు పలకగా, పసుపు, ఎరుపురంగు బెలూన్లతో ఉమ్మడి కృష్ణా జిల్లా, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.



దార్శనికుడు చంద్రబాబు నాయుడు ముందుచూపునకు నిదర్శనం కొండవీటివాగు ఎత్తిపోతల పథకమని అక్కడ లోకేశ్ మరో సెల్ఫీ దిగారు. రాజధాని ప్రాంతంలో కొండవీటి వాగు ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.222 కోట్లతో చంద్రబాబు ఈ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. రికార్డు సమయంలో కేవలం 18 నెలల్లో పూర్తిచేసి 2018 సెప్టెంబరు 16న రాష్ట్ర ప్రజలకు అంకితం చేశారు. ఒకేరోజు ఒక టీఎంసీ నీళ్లు వచ్చినా సమర్థవంతంగా వరదను నివారించే విధంగా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. దివాలాకోరు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రధాన ప్రాజెక్టుల గేట్లకు గ్రీజు పెట్టలేక రైతాంగాన్ని వరదల్లో ముంచెత్తుతున్నాడని ఈ సందర్భంగా లోకేశ్ విమర్శించారు. అనంతరం విజయవాడ నగరంలో పశ్చిమ, సెంట్రల్, తూర్పు నియోజకవర్గాల మీదుగా యువగళం సాగింది. కాళేశ్వరరావు మార్కెట్ వద్ద ముఠా వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైల్వే స్టేషన్ వద్ద ఎలక్ట్రికల్ వర్కర్స్, స్వర్ణా ప్యాలెస్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు, బీసెంట్ రోడ్డులో బుక్ పబ్లిషర్స్ ప్రతినిధులు, విజయా టాకీస్ వద్ద ముస్లిం నేతలు కలిసి తమ సమస్యలను లోకేశ్‌కు వివరించారు.

స్థాయీ సంఘానికి సాక్ష్యం చట్టాలు

రాజ్యసభ ఛైర్మన్ ధన్కర్ సిఫార్సు

మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ఐపీసీ, సీఆర్‌పీసీ స్థానంలో తీసుకొచ్చిన మూడు ప్రతిపాదిత సాక్ష్యం చట్టాలను పరిశీలన కోసం రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్కర్ కేంద్ర హోం వ్యవహారాల స్థాయీ సంఘానికి పంపారు. దీనికి సంబంధించిన నివేదికను మూడు నెలల్లో సమర్పించాలని కోరారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య బిల్లులను ఆగస్టు 11న హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఒకసారి ఆమోదించబడిన ఈ బిల్లులు వరుసగా భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ), నేర ప్రక్రియ నిబంధన (సీఆర్‌పీసీ), భారతీయ సాక్ష్యం చట్టం స్థానంలో ఉంటాయి. బిల్లులను ప్రవేశపెడుతూ... ఇవి భారతదేశ నేరన్యాయ వ్యవస్థను మారుస్తాయని, సత్వర న్యాయం అందించడానికి, ప్రజల సమకాలీన అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా న్యాయ వ్యవస్థను రూపొందించడానికి మార్పులు చేశామని షా అన్నారు. 'ఆగస్టు 18, 2023న రాజ్యసభ స్పీకర్‌తో సంప్రదించి భారతీయ న్యాయ సంహిత-2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-2023, భారతీయ సాక్ష్యా బిల్లు-2023 లోక్‌సభలో ప్రవేశపెట్టినట్లు సభ్యులకు సూచించడం జరిగింది. దానిలో పెండింగ్‌లో ఉన్నందున హోం వ్యవహారాల శాఖ సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపించడం జరిగింది. మూడు నెలల్లోగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోరారు. హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రాజ్యసభకు చెందినది. పార్లమెంటు ఉభయ సభల నుంచి సభ్యులను కలిగి ఉంటుంది' అని శుక్రవారం ఆలస్యంగా విడుదలయిన బులెటిన్‌లో రాజ్యసభ సెక్రటేరియట్ పేర్కొంది. బీజేపీ సభ్యుడు బ్రిజ్ లాల్ హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు. భారతీయ న్యాయ సంహిత పరువు నష్టం, ఆత్మహత్యకు ప్రయత్నించడం, 'మోసపూరిత మార్గాలను' ఉపయోగించడం ద్వారా లైంగిక సంపర్కానికి సంబంధించిన మహిళలపై నేరం పరిధిని విస్తరించడంతో సహా ప్రస్తుత నిబంధనలలో అనేక మార్పులను అందిస్తుంది. ఇది వేర్పాటు చర్యలు, సాయుధ తిరుగుబాటు, విధ్వంసక కార్యకలాపాలు, వేర్పాటువాద కార్యకలాపాలు లేదా దేశద్రోహ చట్టం కొత్త స్వరూపంలో సార్వభౌమాధికారం లేదా ఐక్యతకు అపాయం కలిగించడం వంటి కొత్త నేరాలను కూడా జాబితా చేస్తుంది. అలాగే, మొదటిసారిగా ఐపీసీ కింద లేని బీఎస్‌ఎస్ కింద ఉగ్రవాదం అనే పదాన్ని నిర్వచించారు.

నేటి నుంచి టమాటా కిలో రూ.40

న్యూఢిల్లీ: ఢిల్లీ-ఎన్‌సీఆర్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ఆదివారం నుంచి కిలో టమాటా 40 రూపాయలకే లభించనుంది. రూ.40కే కిలో టమాటాలను విక్రయించాలని నేషనల్ కో-ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్‌కు, నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్‌కు కేంద్రప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అయితే ఈనెల 15వ తేదీ నుంచి కిలో టమోటా రూ.50కు చేరింది. కొన్ని చోట్ల అంతకంటే తక్కువ ధరకే దొరికింది. కేంద్ర ప్రభుత్వం తాజా ఆదేశాలు ఇవ్వక ముందే టమాటా ధరలు దిగొచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లె, అనంతపురంతో పాటు కర్నాటకలో పండుతున్న టమాటా అందుబాటులోకి రావడంతో ఒక్కసారిగా ధర తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. రెండు నెలలుగా ఊహించని ధరతో తారెత్తించిన టమాటా ధరలు తగ్గుతుండటంతో జనం కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు.

నిష్పాక్షిక ఎన్నికలకు తూట్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాదం ఏర్పడింది. సంస్కరణల నెపంతో అన్ని అధికారాలను గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నాలలో భాగంగా ఇటీవల ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా షరతులు, పదవీ కాల పరిమితి) బిల్లు-2023ని రాజ్యసభలో ప్రవేశపెట్టింది. ప్రస్తుతమున్న ఎన్నికల కమిషనర్ల నియామక వ్యవస్థ స్థానే తమకు నచ్చిన విధానాన్ని అమలు చేయడమే ఈ బిల్లు ముఖ్యఉద్దేశం. నియామక ప్యానల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని పక్కన పెట్టేసిన ప్రభుత్వం... కేబినెట్ కార్యదర్శికి ఆ స్థానాన్ని కల్పించింది. ఈసీల నియామక ప్యానల్‌లో ప్రధానితో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కేబినెట్ మంత్రి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సిఫార్సు చేసిన వారినే రాష్ట్రపతి నియమించాలి. అంటే అధికారంలో ఉన్న వారు కోరిన వారికే ఈసీ బాధ్యతలు కట్టబెట్టాలన్నమాట! ఒకవేళ ప్రతిపక్ష నేత అభ్యంతరం చెప్పినాగానీ ఆయనను తోసిపుచ్చే వెలుసుబాటు కమిటీకి ఉంది. ఆ ఒక్కరి గళాన్ని నొక్కేసి ముందుకెళ్లిపోగలదు. దీనిని బట్టి దేశంలో ఇకపై నిష్పాక్షికంగా ఎన్నికలు జరుగుతాయా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగగలవా అన్నది చర్చనీయాంశమైంది.

ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఈసీల నియామక ప్యానల్‌లో సభ్యులుగా సీజేఐ, ప్రధాని, ఎల్‌ఓపీ ఉండాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు పూర్తి వ్యతిరేకంగా కొత్త బిల్లులోని అంశాలు ఉన్నాయి. భారత ఎన్నికల కమిషన్‌ను సర్కార్ శాసించడమే ఉద్దేశంగా ఇది రూపొందిందంటే ఆరోపణ కాదు. ఈ బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఎన్నికల పారదర్శకతను నీరుగార్చేలా కొత్త బిల్లు ఉందని మండిపడ్డాయి.

ఈ బిల్లులోని సెక్షన్ ఆరు ప్రకారం కేబినెట్ కార్యదర్శి, మరో ఇద్దరు కార్యదర్శులు సభ్యులుగా సెర్చ్ కమిటీ ఏర్పాటు కావాలి. ఈ కమిటీ ఈసీగా నియమించేందుకు అర్హులైన వారిని సమగ్రత, విజ్ఞత, అనుభవం ఆధారంగా ఐదుగురిని ఎంపిక చేసి సెలక్షన్ కమిటీ పరిశీలనకు సిఫార్సు చేస్తుంది. సెక్షన్ 8(1) ప్రకారం సీఈసీ, ఈసీల ఎంపిక ప్రక్రియను ఎంపిక కమిటీ నియంత్రించవచ్చు. సెర్చ్ కమిటీ సిఫార్సులను తోసిపుచ్చి వేరెవరినైనా ఎంపిక చేసుకునే అధికారాన్ని సెలక్షన్ కమిటీకి సెక్షన్ 8(2) ఇస్తుంది. అంటే సెర్చ్ కమిటీ సిఫార్సులను తోసిపుచ్చి తమకు నచ్చిన వ్యక్తులు ఎవరినైనా సీఈసీ/ఈసీలుగా సెలక్షన్ కమిటీ నియమించవచ్చు. సర్చ్ కమిటీ శ్రమ వృథా కావడమే కాకుండా నియామక ప్రక్రియలో పారదర్శకత ప్రశ్నార్థకమైంది.

రాజ్యాంగ సభ... స్వతంత్ర ఎన్నికల కమిషన్ ఆలోచనకు పూర్తి విరుద్ధమైన బిల్లును ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈసీఐని అధికార యంత్రాంగంగా మార్చడం ప్రతికూల చర్య. ఎన్నికల కమిషన్ ప్రభుత్వ అధీనంలోకి వెళితే ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతాయన్న హామీ ఉండదు. ఎన్నికల నిష్పాక్షికత, స్వాతంత్ర్యాన్ని ఈసీఐని అపహాస్యం చేసేలా కొత్త బిల్లు ఉంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మదన్ బి.లోకుర్ దీనిపై స్పందిస్తూ 'రాజ్యాంగ సభ ఆలోచనలు, సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ప్రభుత్వ నియంత్రణలోకి ఎన్నికల యంత్రాంగం ఉండేలా కొత్త బిల్లు రూపొందింది. ఇది రాజ్యాంగ సభ ఆలోచనలకు విరుద్ధం. సంస్కరణల పేరిట రాజ్యాంగ సభ నిర్ణయాన్ని, సర్వోన్నత న్యాయస్థానం తీర్పులను ధిక్కరిస్తుండటం ఆమోదయోగ్యం కాదు. కొత్త బిల్లు ప్రకారం భారత ప్రజల కంటే కూడా ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) చెప్పుచేతుల్లోనే ఈసీఐ ఉండనుంది. తద్వార ఎన్నికల ప్రక్రియ స్వతంత్రతపై సందేహాలు వస్తాయి. పీఎంఓకు ఈసీఐని దాసోహం చేసేలా ఉన్న ఈ బిల్లుతో పరిస్థితి మరింత క్షీణిస్తుంది. అంటే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ, పారదర్శకతతో కూడిన ఎన్నికలకు మనం స్వస్తి పలకాల్సి వస్తుంది' అని అన్నారు.

నేరస్తుల మతం ఏదైనా...

ద్వేషపూరిత ప్రసంగాలపై కఠిన చర్యలు

పోలీసులను ఆదేశించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : ఏ మతానికి వ్యతిరేకంగానైనా ద్వేషపూరిత ప్రసంగాలను నేరస్తుల మతంతో సంబంధం లేకుండా 'ఒకేలా పరిగణించాలి', 'చట్టం ప్రకారం వ్యవహరించాలి' అని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని ఒక ఆంగ్ల వార్తా సంస్థ కథనం పేర్కొంది. శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టితో కూడిన ధర్మాసనం ఒక బ్యాచ్ పిటిషన్లను విచారించింది. ద్వేషపూరిత ప్రసంగాలను ఎదుర్కోవడానికి తెహసీన్ పూనావాలా కేసులో 2018 తీర్పులో సుప్రీం కోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని ధర్మాసనం ఆశాభావం వ్యక్తం చేసింది. నిర్దిష్ట 2018 తీర్పులో మూక హత్యలు, ద్వేషపూరిత ప్రసంగాలను నిరోధించడానికి రాష్ట్రాలు తీసుకోవాల్సిన మార్గదర్శకాలు, నివారణ చర్యల విస్తృతమైన మార్గదర్శకాలను అత్యున్నత న్యాయస్థానం జారీ చేసింది. 'మేము చాలా స్పష్టంగా ఉన్నాము. ఇది ఒక వైపు అయినా, మరొక వైపు అయినా, వారితో సమానంగా వ్యవహరించాలి. 'ద్వేషపూరిత ప్రసంగం' అని మనకు తెలిసిన దానిలో ఎవరైనా పాల్గొంటే, చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటారు. మేము ఇప్పటికే మా అభిప్రాయాన్ని వ్యక్తం చేసాము. ఇది పునరావృతం చేయవలసిన అవసరం లేదు' అని ధర్మాసనం తరపున న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా స్పష్టం చేశారని లైవ్‌లా పేర్కొంది. జులైలో ఇండియన్ యూనియన్ ఆఫ్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) యువ విభాగం కేరళలో నిర్వహించిన ర్యాలీలో 'హిందువులకు చావు' అనే నినాదాన్ని లేవనెత్తారని పిటిషనర్లలో ఒకరు కోర్టుకు సమర్పించారు. మతంతో సంబంధం లేకుండా ఎవరైనా ద్వేషపూరిత ప్రసంగాలను సహించబోమని కోర్టు పేర్కొంది. పిటిషనర్ ప్రస్తావించిన ప్రత్యేక సంఘటనకు సంబంధించి, హిందువులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే నినాదాలు చేశారనే ఆరోపణలపై కేరళ పోలీసులు ఐయూఎంఎల్ యువజన విభాగం సభ్యులతో సహా 300 మందిపై కేసు నమోదు చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) లో ఐయూఎంఎల్ ఒక సభ్య పార్టీగా ఉంది. హరియానాలో ఇటీవలి నుహ్ హింసాకాండ సందర్భంగా ముస్లింలకు వ్యతిరేకంగా చేసిన ద్వేషపూరిత ప్రసంగాల సందర్భాలను ఆరోపిస్తూ షహీన్ అబ్దుల్లా ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన తర్వాత కోర్టు శుక్రవారం మళ్లీ ద్వేషపూరిత ప్రసంగంపై పిటిషన్లను విచారించింది. కొన్ని హిందూ సంఘాలు ముస్లింలను బహిష్కరించాలని బహిరంగ పిలుపునిచ్చాయని, దుకాణదారులకు తమ దుకాణాలలో ముస్లింలను నియమించుకోవద్దని హెచ్చరించాయని పిటిషనర్ ఆరోపించారు. కాగా, ఆరోపణలను పరిశీలించడానికి, నేర కేసులు దాఖలయితే ధ్రువీకరించడానికి కమిటీ ఏర్పాటుకు సంబంధించి సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారా లేదా అనే వివరాలతో ప్రతిస్పందనతో తిరిగి రావడానికి కేంద్రం, హరియానా ప్రభుత్వానికి డివిజన్ బెంచ్ వారం రోజుల సమయం ఇచ్చింది.

పంజాబ్ మంత్రికి పాముకాటు

చండీగఢ్: హిమాచల్ నుంచి పెద్దఎత్తున వరదను కిందికి వదలడంతో బియాస్, సట్లెజ్ నదులు పొంగాయి. పంజాబ్‌లోని రూప్‌నగర్, గురుదాస్‌పూర్, హోషియార్‌పూర్, కపుర్తలా, ఫిరోజ్‌పూర్ జిల్లాలు ప్రభావితమయ్యాయి. వరద పీడిత ప్రాంతంలో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు వెళ్లిన విద్యాశాఖ మంత్రి హర్‌జోత్ సింగ్ బైన్స్ అనుకోని విధంగా పాముకాటుకు గురయ్యారు. 15వతేదీ రాత్రి ఈ ఘటన జరిగింది. తనను విషసర్పం కాటేసినట్లు మంత్రి ట్వీట్ చేశారు. వెంటనే ఆస్పత్రిలో చేరినట్లు పేర్కొన్నారు. ప్రజలకు సాయం చేయాలనే తన సంకల్పాన్ని ఈ ఘటన అడ్డుకోలేక పోయిందని, భగవంతుడు, ప్రజల ఆశీర్వాదంతో క్షేమంగా ఉన్నానని, తన రక్తంలో విషం ప్రభావం తగ్గినట్లు పరీక్షల్లో తేలిందని మంత్రి వెల్లడించారు. ఈయన రూప్‌నగర్ జిల్లాలోని ఆనంద్‌పూర్ సాహిబ్ నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు.

తమిళనాడులో నలుగురి మృతి

చెన్నై: దోమలను నివారించే యంత్రం నుంచి వచ్చిన పొగ వల్ల ఒక వృద్ధురాలు, ఆమె ముగ్గురు మనవరాళ్లు మృతి చెందిన ఘటన తమిళనాడులో చోటు చేసుకుంది. మనాలి సమీపంలో ఉండే సంతానలక్ష్మి(65)కి సంధ్య, ప్రియా రక్షిత, పవిత్ర అనే ముగ్గురు మనవరాళ్లు ఉన్నారు. వీరి తండ్రి కోసం తల్లి ఆసుపత్రికి వెళ్లడంతో బాలికలు తమ బామ్మ వద్దకు వెళ్లి రాత్రి భోజనం చేసి అక్కడే నిద్రించారు. వారు నిద్రలోకి జారుకున్న తర్వాత దోమలను నివారించే యంత్రం నుంచి మంటలు చెలరేగి పొగ ఇల్లంతా కమ్ముకుంది. తెల్లవారుజామున ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని పక్కింటి వారు గమనించి పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

'గ్రూప్' పరీక్షల ఫీవర్

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారు. దీనికి అభ్యర్థులు తయారు కావాలంటే ఏడాది నుంచి రెండేళ్ల సమయం పడుతుంది. తొలి ప్రయత్నంలో ఉద్యోగాలు సాధించలేని వారంతా మళ్లీ ఏపీపీఎస్సీ ప్రకటన కోసం పడిగాపులు కాయాల్సిందే. ఏపీపీఎస్సీ నుంచి నిర్ణీత సమయంలో ఉద్యోగ క్యాలెండర్ లేనందున రెండేళ్లకు, మూడేళ్లకోసారి గ్రూప్ 1, 2 ప్రకటించడంతో అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. వచ్చిన ప్రకటనలోనూ పోస్టుల సంఖ్య కుదించుకుపోవడంతో నిరుత్సాహపడుతున్నారు. 110 గ్రూప్-1 ఉద్యోగాలకు అభ్యర్థుల్ని ఇటీవల ప్రకటించారు. చాలామంది గ్రూప్-1 ప్రిలిమ్స్ అర్హత సాధించలేదు. మరికొందరు ప్రిలిమ్స్ అర్హత సాధించి, మెయిన్స్‌లో విఫలమయ్యారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌లో అర్హత సాధించి, ఇంటర్వ్యూ వరకు వచ్చాక కొందరు నెగ్గలేకపోతున్నారు. వాళ్లంతా గ్రూప్-1 సిలబస్‌ను మొదటి నుంచి చదవాల్సిందే.

సిలబస్ మార్పుతో అభ్యర్థులపై ఒత్తిడి

పదేపదే గ్రూప్-1, 2 సిలబస్ మార్పుతో అభ్యర్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఒకసారి చదివిన సిలబస్‌ను రివిజన్ చేసుకోవడం తేలికవుతుంది. అదే సిలబస్‌కు అదనంగా సిలబస్ చేర్చినా...ఉన్న సిలబస్‌ను తొలగించి మరికొంత చేర్చినా అభ్యర్థులకు నష్టం కలుగుతుంది. వారి ప్రిపరేషన్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని నిర్దిష్టమైన సిలబస్‌ను ఏపీపీఎస్సీ ఎంపిక చేయాల్సి ఉంది. పదేపదే పరీక్షలకు ముందు సిలబస్ మార్పు వల్ల ఒరిగేదేమీ ఉండదని పోటీ పరీక్షల నిపుణులు అంటున్నారు. సెప్టెంబరులో గ్రూప్-1 ప్రకటన ఉన్నందున... ఈ తక్కువ సమయంలోనే సిలబస్ మార్పు చేయడం సముచితం కాదని సూచిస్తున్నారు. సిలబస్ మార్పు వల్ల సంబంధిత పోటీ పరీక్షల మెటీరియల్ ముద్రణకు, పోటీ పరీక్షల నిర్వహణ సంస్థలకు భారమవుతుంది. ఇప్పటికే సరిగ్గా ఉద్యోగ ప్రకటనలు లేవని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క గ్రామ, వార్డు సచివాలయాలకే దాదాపు లక్షా 45 వేల పోస్టులు భర్తీ చేశారు. దానివల్ల చాలామంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందారు. 2019 నుంచి ఏపీపీఎస్సీ ద్వారా 64 ప్రకటనలు విడుదల చేసినప్పటికీ...వాటిలో భారీగా ఉద్యోగాల నియామకం జరగలేదు. ఎన్నికలకు మరో 8 నెలలే సమయం ఉంది. ఈలోగా జగన్ ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు ఇస్తుంది? వాటిలో ఉద్యోగాల సంఖ్య ఎంత ఉంటుందనేదీ ప్రశ్నార్థకమే.

తాజా నోటిఫికేషన్లకు సిద్ధం

మళ్లీ గ్రూప్-1, 2 నోటిఫికేషన్ల విడుదలకు ఏపీపీఎస్సీ సిద్ధమైంది. సెప్టెంబరులో గ్రూప్-1 నోటిఫికేషన్ రానుంది. ఆ నోటిఫికేషన్‌కు తాజా సిలబస్‌ను అమలు చేస్తారు. దీనికి నెల రోజులే సమయం ఉంది. ఈలోగా సిలబస్‌పై కసరత్తు పూర్తయిందా? లేదా? అనేదీ ఏపీపీఎస్సీ వెల్లడించలేదు. సంబంధిత అధికార వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచలేదు. దీంతో గత్యంతరం లేక అభ్యర్థులు గత గ్రూప్-1కు సిద్ధమైన పాత సిలబస్‌పైనే దృష్టి సారించారు. సిలబస్ మార్పు ప్రక్రియను ఏపీపీఎస్సీ వేగవంతంగా చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. లేకుంటే రాబోయే గ్రూప్-1 ఉద్యోగాల ప్రిపరేషన్‌కు తమకు సమయం చాలబోదని వాపోతున్నారు. ఇక గ్రూప్-2కు దాదాపు వెయ్యి ఉద్యోగాలతో ప్రకటన రాబోతుందని గౌతమ్ సవాంగ్ వెల్లడించిన విషయం విదితమే. గ్రూప్-2 సిలబస్‌లోనూ మార్పులు, చేర్పులు ఉంటాయనే సమాచారంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రూప్-2 సిలబస్‌ను 110 రోజుల క్రితం ప్రకటించారు. గ్రూప్-2 ప్రిలిమ్స్ 150 మార్కులకు, మెయిన్స్ 300 మార్కులకు ఉంటుంది. ఇలా పదేపదే సిలబస్ మార్చుకుంటూ పోవడంతో అభ్యర్థులు నష్టపోయే ప్రమాదముంది. గ్రూప్-2 ప్రిలిమ్స్‌కు 3 నెలలు, ఆ తర్వాత మెయిన్స్‌కు మరో 3 నెలలపాటు సన్నద్ధత సమయం అభ్యర్థులకు కావాలి. దానికి అనుగుణంగా గ్రూప్-2 మెయిన్స్, ప్రిలిమ్స్ తేదీలను ఖరారు చేయాల్సి ఉంది. జగన్ ప్రభుత్వం, ఏపీపీఎస్సీ బోర్డు నిర్వాహకులు అభ్యర్థుల సమస్యలను గమనించి గ్రూప్-1, 2 సిలబస్‌లలో మార్పులు లేకుండా యథాతథంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గడువు పెంచండి

మెడికల్ కౌన్సెలింగ్‌పై ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ సీట్ల భర్తీకి గడువు పెంచాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి మందగల్ల సాయికుమార్ డిమాండ్ చేశారు. కనీసం ఒకవారం అదనంగా కేటాయించాలని యూనివర్సిటీలకు సూచించారు. వైద్య కళాశాలల్లో ప్రవేశానికి ఒక వైపు కౌన్సెలింగ్, మరోవైపు కన్వీనర్ కోటా సీట్ల కోసం ఆలిండియా స్థాయిలో రెండవ విడత కోటా పూర్తి కాకుండానే రాష్ట్రస్థాయిలో రెండవ రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహించడం దుర్మార్గమని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కోసం ఒక రోజులో వెబ్ ఆప్షన్ పెట్టుకోమని, రెండో రోజు సీటు కేటాయిస్తామని దివాళాకోరు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఈ చర్య జగన్ పాలనను తుగ్లక్ పరిపాలనగా నిరూపించేలా ఉందని వ్యాఖ్యానించారు.

టీడీపీ ఎందుకు నచ్చిందో పవన్ చెప్పాలి: బొత్స

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: టీడీపీ ఎందుకు నచ్చిందో దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. విశాఖపట్నం వైసీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మంత్రి విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి జగన్ మీద చంద్రబాబు, లోకేశ్, పవన్ విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని, చంద్రబాబు సహనం కోల్పోవాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. నోటికి ఏమొస్తే అది మాట్లాడుతున్నారని, ప్రజాక్షేత్రంలో నాయకుడయ్యే ఆలోచన పవన్‌కు లేనట్లుందన్నారు. ఎవరో ఇచ్చిన స్క్రిప్టు చదువుతున్నారని విమర్శించారు. పరిపక్వతలేని నాయకుడు

అడిగిన దానికి మేము సమాధానం చెప్పాలా అని పవన్‌నుద్దేశించి అన్నారు. చంద్రబాబు పాలన బాగుందని పవన్ చెప్తున్నారని, దీనికి కొలమానం ఏమిటని బొత్స ప్రశ్నించారు. ఏ ప్రాంతానికి వెళ్లినా ఒక్క ఉదాహరణ అయినా చెప్పారా? అప్పటి-ఇప్పటి పాలనకు తేడా చెప్పారా? పచ్చకామెర్లోడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది. ఈ కేకలు, అరుపులు అన్నీ కొత్త అమావాస్య వరకు మాత్రమే, ఆ తర్వాత ఏమీ ఉండవు' అని వ్యాఖ్యానించారు. ప్రజల సొమ్ముతోనే, ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేందుకు యత్నిస్తుందని, నీలాగా, దళారులు, మధ్యవర్తులు పెట్టి దోచుకుని తినలేదన్నారు. చంద్రబాబుకు ఏపీలో ఇల్లు ఉందా?, ప్రత్యేక హోదాను ఎవరు తాకట్టు పెట్టారో చంద్రబాబు చెప్పాలని బొత్స ప్రశ్నించారు. రుషికొండలో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తుంటే ఇబ్బంది ఏమిటని మంత్రి ప్రశ్నించారు.

ప్రమాదకర పరిశ్రమల్లో

థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ జరగాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలోని ప్రమాదకర పరిశ్రమలన్నిటిలో థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ జరగాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి ఆదేశించారు. రసాయన ప్రమాదాల నివారణపై శనివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర క్రైసెస్ గ్రూపు సమావేశం సీఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి మాట్లాడుతూ రసాయన సంబంధిత పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఇలాంటి పరిశ్రమలన్నిటిలో పాటిస్తున్న భద్రతా ప్రమాణాలు, చర్యలపై థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ జరగాలని పునరుద్ఘాటించారు. వివిధ సాల్వెంట్లు (రసాయన ద్రావకాలు) వినియోగించే పరిశ్రమల్లో ఆయా ద్రావకాల ఘాటత వాటి స్వభావాన్ని ముందే పరీక్షించి తెలుసుకునేలా ల్యాబ్‌లు ఏర్పాటు చేసేలా చూడాలని పరిశ్రమలు, ఫ్యాక్టరీల శాఖల అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నివారణపై ప్రత్యేక మాక్ డ్రిల్‌తో పాటు ప్రమాదాల నివారణకు అనుసరిస్తున్న ప్రోటోకాల్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రమాదాల నివారణకు రాష్ట్ర, జిల్లా, స్థానిక స్థాయి క్రైసెస్ గ్రూపులు

తరచూ సమావేశమై పారిశ్రామిక ప్రమాదాల నివారణకు అనుసరిస్తున్న మార్గదర్శకాలు, భద్రతా చర్యలు, ప్రోటోకాల్‌ను సమీక్షించాలని సీఎస్ స్పష్టం చేశారు. గత రెండేళ్లలో రసాయన పరిశ్రమల్లో 11 ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరిశ్రమల్లో సాంకేతిక పరిజ్ఞానం గల సిబ్బంది లేకుంటే అక్కడ పనిచేసే సిబ్బందికి వాటి నిర్వహణపై ఆయా పరిశ్రమలు ముందే తగిన శిక్షణ ఇవ్వాలని తెలిపారు. రసాయన సంబంధిత ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అనేక జాగ్రత్తలపై సీఎస్ అధికారులతో చర్చించారు. రాష్ట్ర ఫ్యాక్టరీల డైరెక్టర్ డి.చంద్రశేఖర్ వర్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశ అజెండా అంశాలను వివరించారు. 1948 ఫ్యాక్టరీల చట్టాన్ని అనుసరించి 1986 రసాయన ప్రమాదాల నిబంధనల ప్రకారం జాతీయ, రాష్ట్ర, జిల్లా, స్థానిక స్థాయిల్లో క్రైసెస్ గ్రూపులు ఏర్పాటు అయ్యాయన్నారు. రాష్ట్ర స్థాయి క్రైసెస్ గ్రూపునకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా స్థాయికి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, స్థానిక గ్రూపునకు ఆర్డీవో అధ్యక్షులుగా ఉండి తరచూ సమావేశమై ఈ ప్రమాదాలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. 1948 ఫ్యాక్టరీల చట్టం ప్రకారం రాష్ట్రంలో 1,129 ఫ్యాక్టరీలు హజార్డస్ కిందకు వస్తాయని చెప్పారు. గత ఆరు మాసాల్లో వివిధ శాఖల సమన్వయంతో 600 మాక్ డ్రిల్‌లను పూర్తి చేశామని వివరించారు. 637 ఫ్యాక్టరీలు ప్రమాదాలపై అప్రమత్తతకు సెన్సార్లను ఏర్పాటు చేసుకోగా మిగతావి ఏర్పాటు చేసుకోవాల్సి ఉందని అన్నారు. థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ కోసం 243 పరిశ్రమలను షార్టు లిస్టు చేయగా ఇప్పటికే 216 పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ పూర్తయిందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ కె.ప్రవీణ్ కుమార్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ డా. .బి.ఆర్.అంబేద్కర్, సీడీఎంఏ కోటేశ్వరరావు, ఏపీఎస్పీ డీఐజీ బి.రాజకుమారి, రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ శాఖ డైరెక్టర్ డి.మురళీ మోహన్, పీసీబీ జాయింట్ చీఫ్ ఇంజనీర్ భాస్కరరావు తదితర అధికారులు పాల్గొనగా వీడియో లింక్ ద్వారా ఓఎన్జీసీ అధికారులు, వివిధ కంపెనీల నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత గల జర్నలిస్టు కృష్ణారావు

ఏపీయూడబ్ల్యూజే నేతల నివాళి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నిబద్ధత గల జర్నలిస్టు కృష్ణారావు మృతి తెలుగు జర్నలిజానికి తీరని లోటని ఏపీయూడబ్ల్యూజే నేతలు పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు సీహెచ్‌వీఎం కృష్ణారావు మృతికి సంతాపసూచకంగా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన చిత్రపటానికి యూనియన్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏ అంశంపై అయినా తన అభిప్రాయాన్ని ముక్కుసూటిగా తెలియజేయడంతో పాటు అన్ని రంగాలపై సమగ్ర అవగాహన, విశ్లేషణ చేయగల అరుదైన జర్నలిస్టు అని కొనియాడారు. వివిధ దినపత్రికల్లో కీలక బాధ్యతలు నిర్వహించిన కృష్ణారావు... ప్రత్యేక వార్తా కథనాలు, కాలమ్స్ ద్వారా గుర్తింపు పొందారని, ముఖ్యంగా ఇటీవల ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ విశ్లేషకుడిగా విశేష ప్రాచుర్యం పొందారని, జర్నలిస్టుల సమస్యలపై ఆయన ఏపీయూడబ్ల్యూజే వాదనలకు మద్దతు పలికేవారని తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే విజయవాడ అధ్యక్షుడు చావా రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్, ఉపాధ్యక్షుడు కంచల జయరాజు, రాష్ట్రకార్యవర్గసభ్యుడు భక్తవత్సలం, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, సామ్నా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ భాస్కర్, ప్రధానకార్యదర్శి రూబెన్, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఆర్.వసంత్, ఐజేయూ కౌన్సిల్ సభ్యులు షేక్ బాబు, సాంబశివరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దారం వెంకటేశ్వరరావు, జి.రామారావు, దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అరసం జాతీయ మహాసభలకు రాష్ట్ర ప్రతినిధి బృందం పయనం

విశాలాంధ్ర-విజయవాడ : అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం 18వ జాతీయ మహాసభలు ఈ నెల 20,21,22 లలో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరుగనున్నాయి. ఈ మహాసభలకు హాజరు అయ్యేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి 15 మందితో కూడిన ప్రతినిధి బృందం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీ నారాయణ, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్‌ల నేతృత్వంలో విజయవాడ నుంచి జబల్‌పూర్‌కు బయలుదేరింది. మహాసభలకు బయలుదేరే ముందు పెనుగొండ విలేకరులతో మాట్లాడుతూ, దేశంలోని ప్రస్తుత సామాజిక, రాజకీయ పరిస్థితులు, రచయితలు, కవులు ఎదుర్కొంటున్న సమస్యలు- ముందున్న సవాళ్లు వంటి పలు అంశాలపై ప్రసంగాలు, కవి సమ్మేళనం, కళాకారుల ప్రదర్శనలు జరుగుతాయని అన్నారు. మహాసభలకు వెళ్లిన వారిలో పెనుగొండ లక్ష్మీనారారయణ, వల్లూరు శివప్రసాద్‌తో పాటు అరసం ప్రతినిధులు జీ.ఓబులేసు, ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డి, ఏఎమ్ఆర్ ఆనంద్, బీఎన్ సాగర్, చెరుకుమల్లి సింగారావు, మోతుకూరి అరుణకుమార్, శిఖా ఆకాశ్, ఎస్.వెంకట సుబ్బయ్య, బంగారు బీవీ ఆచార్యులు, ఉప్పల అప్పలరాజు, తుమ్మలూరి సురేష్ బాబు, గూటం స్వామి ఉన్నారు.

చరితార్థుడు పడాల శ్యామసుందరరావు

'చరిత్ర మరచిన చిత్తరువు' పుస్తకావిష్కరణ సభలో వక్తలు

విశాలాంధ్ర-నరసాపురం: నీతినిజాయతీతో, నిబద్ధతతో ప్రజాజీవితంలో కొనసాగిన అమరజీవి పడాల శ్యామసుందరరావు జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. నరసాపురం తొలి శాసనసభ్యులు, సీపీఐ నేత పడాల శ్యామసుందరరావు జీవితచరిత్ర 'చరిత్ర మరిచిన చిత్తరువు' పుస్తకావిష్కరణ సభ వైఎన్ కళాశాల పీజీ సెంటర్‌లో శనివారం నిర్వహించారు. సభకు సీపీఐ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. శ్యామసుందరరావు పెద్ద కుమార్తె డాక్టర్ సమతా రోష్నీ, చరిత్ర పరిశోధకుడు గుర్రం సీతారాములు సంపాదకత్వంలో వెలువడిన పుస్తకాన్ని 'దారిదీపం' ఎడిటర్ డీవీవీఎస్ వర్మ ఆవిష్కరించారు. అనంతరం డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ విలువలు కోల్పోయిన నేటి సమాజంలో నిజాయతీ, నిబద్ధత కలిగిన పడాల శ్యామ సుందరరావు వంటి మహనీయుల ఆదర్శాలను వెలుగులోకి తీసుకురావాలని అన్నారు. చీకటిలో నడుస్తున్న వర్తమానాన్ని మార్చాలంటే గతచరిత్ర తెలుసుకోవాలని చెప్పారు. కమ్యూనిస్టు ఉద్యమానికేకాక స్థానిక చరిత్రకు కూడా ఆధారాలు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా స్థానిక చరిత్రను, అలనాటి విలువలు కలిగిన నేతల జీవితాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. సమతా రోష్నీ, గుర్రం సీతారాములు చేసిన ప్రయత్నం అభినందనీయమని పేర్కొన్నారు. వైఎన్ కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ డా.చినిమిల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ తమ బాల్యంలోనే పడాల శ్యామసుందరరావు గురించి, వారి కృషి గురించి విన్నానని చెప్పారు. అలనాటి సబ్ కలెక్టర్ బంగ్లాను, స్థలాన్ని వైఎన్ కళాశాలకు అప్పగించడానికి శ్యామ సుందరరావు గట్టి కృషి చేశారని, అందువల్లనే తమ కళాశాలకు విశాలమైన స్థలం సమకూరిందన్నారు.

మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ పడాల శ్యామసుందరరావు కుటుంబంతో తనకు బాల్యం నుండి అనుబంధం ఉందని, వారి పిల్లలతో కలిసి తాము చదువుకున్నామన్నారు. శ్యామ సుందరరావు సతీమణి కాంతమ్మ ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడటం తనకు గుర్తుందన్నారు. ఆమె ఉద్యమస్ఫూర్తి నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చెప్పారు. శ్యామసుందరరావు ఆదర్శప్రాయుడని, నిరాడంబర జీవనం సాగించారని అన్నారు. పడాల వారి శాసనసభా కార్యకలాపాల వివరాలు చూస్తే వారికి శాసన వ్యవహారాలపై గల అవగాహన అవగతమవుతుందన్నారు. శ్యామసుందరరావును నేటి ప్రజాప్రతినిధులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పుస్తకాన్ని ఐజేయూ జాతీయకార్యదర్శి డి.సోమసుందర్ సమీక్షించారు. సభలో మహిళాసమాఖ్య ఉమ్మడి రాష్ట్ర నాయకురాలు పి.ప్రేంపావని, చరిత్ర పరిశోధకులు డా.గుర్రం సీతారాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.భీమారావు, న్యాయవాది కామన బాల సత్యనారాయణ(బుజ్జి), విశ్రాంత ప్రిన్సిపాల్ సంకు మనోరమ, రచయిత యర్రంశెట్టి శ్రీనివాస్, రచయిత్రి కరుణ తాయమ్మ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ, సీపీఐ ఏరియా కార్యదర్శి నెక్కంటి క్రాంతి కుమార్ తదితరులు మాట్లాడుతూ శ్యామసుందరరావు జీవితం, కృషి, ఆయన పాటించిన విలువలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. శ్యామసుందరరావు కుమార్తె మమతా నళిని వందన సమర్పణ చేశారు.

పంచాయతీ ఉప ఎన్నికల్లో అధికార దుర్వినియోగం

నక్కా ఆనంద్‌బాబు విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్థానిక సంస్థల ఉపఎన్నికల్లో నిస్సిగ్గుగా అధికార దుర్వినియోగానికి వైసీపీ పాల్పడుతోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలను అవహేళన చేస్తోందని దుయ్యబట్టారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ '34 పంచాయతీలు, 234 వార్డుల్లో ఉపఎన్నిక జరుగుతోంది. ఈ ఎన్నికల్లో పోలీస్ వ్యవస్థను, వాలంటీర్లను వైసీపీ దుర్వినియోగించింది. స్థానిక ఎన్నికలకే ఇలా వ్యవహరిస్తే, రాబోయే సార్వత్రిక ఎన్నికలప్పుడు ఎలాంటి పరిస్థితి ఉంటుందో ప్రజలు అర్థం చేసుకోవాలి' అని అన్నారు. దెందులూరు నియోజకవర్గంలో వీరమ్మకుంట పంచాయతీకి ఉపఎన్నిక జరుగుతుంటే, వైసీపీ ఎమ్మెల్యే పోలింగ్ బూత్‌లో కూర్చొని రిగ్గింగ్ చేయించినట్లు ఆరోపించారు. స్థానిక డీఎస్పీనే ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని బూత్‌లోకి తీసుకెళ్లడాన్ని ఏమనాలని ఆనంద్‌బాబు ప్రశ్నించారు. దెందులూరు టీడీపీ ఇన్‌చార్జి చింతమనేని ప్రభాకర్, తమ పార్టీ కార్యకర్తల్ని దరిదాపుల్లోకి రాకుండా అడ్డుకున్న పోలీసులు... ఎమ్మెల్యేని బూత్‌లోకి అనుమతించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం కాదా అని నిలదీశారు. 'ఉమ్మడి అనంతపురం జిల్లా హిందూపురంలో వాలంటీర్లు నేరుగా ఓటర్లను ప్రలోభపెట్టారు. వాలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొని, అధికారపార్టీకి పనిచేస్తుంటే ఎన్నికల కమిషన్ స్పందించదా? వాలంటీర్లు ఎన్నికలవిధుల్లో పాల్గొనడానికి వీల్లేదని కేంద్ర ఎన్నికల సంఘం చెప్పినా రాష్ట్ర

ఎన్నికల సంఘం ఎందుకు చర్యలు తీసుకోదు? పోలీసులు, వాలంటీర్ల ద్వారా డబ్బు, మద్యంతో పంచాయతీ ఓటర్లను ప్రలోభపెట్టి, మొక్కుబడిగా ఉపఎన్నికలు నిర్వహించి గెలిచామని చెప్పుకోవడమే అధికార పార్టీ కుట్ర' అని వ్యాఖ్యానించారు. ప్రజలు ఛీకొడుతున్నా, తమ పతనం కళ్ల ముందు కనిపిస్తున్నా వైసీపీ ఇలాంటి చౌకబారు చర్యలతో గెలుపు కోసం వెంపర్లాడుతోందని విమర్శించారు. రెండేళ్ల క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఇంతకంటే దారుణంగా వ్యవహరించి, ఎక్కువ స్థానాలు గెలిచామని చంకలు గుద్దుకుందని అన్నారు. అధికార పార్టీ, జగన్ మోహన్ రెడ్డి పని అయిపోయిందని తెలిసినా పోలీస్ వ్యవస్థ ఇంకా ఊడిగం చేయడం బాధాకరమని, సార్వత్రిక ఎన్నికల్లో ఈ పార్టీకి ప్రజలే బుద్ధిచెబుతారు' అని ఆనంద్ బాబు అన్నారు.

ఫొటోలు చరిత్రకు అధారం

కలెక్టర్ ఢిల్లీ రావు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): కాలగర్భంలో కలిసిన చరిత్రను సజీవంగా నిలిపేది ఫొటో మాత్రమేనని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు కొనియాడారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్(ఏపీపీజేఏ) అధ్వర్యంలో శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దశాబ్దాల తర్వాత కూడా ఒక ఫొటో మన పాత జ్ఞాపకాలను కళ్ల ముందు కదలాడే విధంగా చేస్తాయన్నారు. ఫొటోగ్రఫీ అనేది మన బాల్యపు జ్ఞాపకాలను గుర్తుకు తెస్తాయన్నారు. ఫొటో లేకుండా పేపర్ చదివితే ఫొటో జర్నలిజం విలువ తెలుస్తుంది. ఫొటో లేకుండా పేజీ కూడా చూడాలని పించదు. ఫొటో చూసే ఆ వార్తను మనం అర్థం చేసుకోవచ్చు. అంత ప్రాధాన్యత ఫొటోగ్రఫీకి ఉందని కలెక్టర్ అన్నారు. ఫొటో జర్నలిస్టుల కోసం లక్ష రూపాయలు ప్రకటిస్తున్నామని, విజయవాడ ప్రెస్‌క్లబ్ అభివృద్ధి కోసం రూ.15 లక్షల నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు. మాజీమంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏదైనా శుభకార్యం జరిగితే అక్కడ ఫొటోగ్రాఫర్ తప్పకుండా ఉండాల్సిందేనన్నారు. ఫొటోగ్రఫీ తీపిజ్ఞాపకాలు అందిస్తుందన్నారు. ఫొటో గ్రాఫర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఫొటోగ్రఫీ జర్నలిజంతో రాజకీయం ముడిపడి ఉంటుందన్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన చిత్రాలు బాగున్నాయని, ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టులు తమ ఆత్మీయ బంధువులని కొనియాడారు. ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని, అలాగే జర్నలిస్టులు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఫొటో కాంపిటీషన్‌లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి దేవినేని అవినాశ్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యుడు షేక్ బాబు, ఏపీయూడబ్ల్యూజే నాయకులు, ఏపీపీజేఏ అధ్యక్షుడు సీహెచ్‌వీఎస్. విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి వి.రూబెన్ బెసాలియల్, గౌరవ అధ్యక్షుడు జి.నారాయణ, కోశాధికారి మహేశ్, ఉపాధ్యక్షులు ఎన్.సాంబశివరావు, వి.పెద్దిరాజు, సహాయకార్యదర్శి సీహెచ్‌వీ మస్తాన్, ఈసీ సభ్యులు ఎస్ఎస్ విజయ్‌బాబు, సీహెచ్ వెంకట్, ఏ.శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీఐఎస్ నిబంధనల అమలు వాయిదా వేయాలి

విశాలాంధ్ర-విజయవాడ: సగటు భారతీయుడు రోజూ తొడిగే పాదరక్షలు, ఫ్యాషన్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్లపై బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) నిబంధనలు అమలు కనీసం రెండేళ్ల వరకు వాయిదా వేయాలని ఏపీ ఫుట్‌వేర్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విజయవాడలోని పాపులర్ భవన్‌లో శనివారం ఫుట్‌వేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం అసోసియేషన్ అధ్యక్షుడు చుక్కపల్లి అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, సాంప్రదాయ వృత్తి అయిన చెప్పుల తయారీకి భారత ప్రమాణాలను నిర్దేశించడం వల్ల లక్షలాది పేద, మధ్య తరగతి చెప్పుల తయారీదారులు కష్టనష్టాలకి లోనవుతారని తెలిపారు. శాస్త్రీయ ప్రమాణాలు తెలుసుకోవటం వల్ల ఎక్కువ సంఖ్యలో యూనిట్లు మూతపడే ప్రమాదం ఉందన్నారు. అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ హెచ్.చంద్రశేఖర్ మాట్లాడుతూ బీఐఎస్ అమలు చేయటం వలన పాదరక్షల తయారీ సమయం, ఖర్చు

పెరుగుతోందన్నారు. ఉత్పత్తి తగ్గి పరిశ్రమ కుచించుకుపోయే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో బీఐఎస్ ల్యాబ్స్ 2, ఎఫ్‌డీడీఐ ల్యాబ్స్ 2, సర్టిఫైడ్ ల్యాబ్స్ 11 మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. ల్యాబ్స్ సంఖ్య, సామర్థ్యం పెంచే వరకు బీఐఎస్ నిబంధనల అమలును వాయిదా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాఫిట్ షూ కంపెనీ ఎండీ బీఎస్ కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చట్టాల మార్పు అవశ్యం

ఎంపీ విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాలం చెల్లిన చట్టాలను రద్దుచేయడం, వాటి స్థానంలో కొత్తవి తీసుకురావడం, అవసరమైతే చట్టాలు సవరించడం, మారుతున్న కాలానికి, అవసరాలకు అనుగుణంగా కొత్త చట్టాలు చేయడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సర్వసాధారణమని రాజ్యసభ సభ్యులు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి అన్నారు. 186 ఏళ్ల చరిత్ర కలిగిన భారత శిక్షా స్మృతి(ఐపీసీ)కి ఎట్టకేలకు కొత్త న్యాయ విచారణ చట్టాల రూపకల్పనకు కేంద్రం శ్రీకారం చుట్టడంపై విజయసాయిరెడ్డి ఆయన అభిప్రాయాలను శనివారం వెల్లడించారు. భారత శిక్షాస్మృతి-1860, నేర విచారణ ప్రక్రియ స్మృతి-1898, భారత సాక్ష్య చట్టం-1872 స్థానంలో కొత్త చట్టాలు తీసుకొచ్చే ప్రక్రియ పార్లమెంటులో ప్రారంభమైందన్నారు. స్వతంత్ర భారతంలో ఇది విప్లవాత్మక చర్యగా భావిస్తున్నారని చెప్పారు. ఈ నెల 11న ఈ మూడు చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత బిల్లు (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత బిల్లు (బీఎన్ఎసెస్), భారతీయ సాక్ష్య బిల్లు (బీఎస్)లను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కీలకమైన ఈ మూడు బిల్లులను సమగ్రంగా, లోతుగా అధ్యయనం చేసి... వాటిలో అవసరమైన మార్పులు, చేర్పులు సూచించడానికి పార్లమెంటరీ కమిటీకి నివేదించినట్లు వివరించారు. ఈ మూడు చట్టాలు న్యాయవ్యవస్థ విచారణ ప్రక్రియకు సంబంధించినవి కావడంతో కొత్త బిల్లులపై ఆసక్తి పెరుగుతోందనన్నారు. బ్రిటిష్ కాలంలో రూపొందించి, అమల్లోకి తెచ్చిన పై మూడు చట్టాలకు స్వతంత్ర భారతంలో అవసరమైన సవరణలు చేశారన్నారు.

సంపాదకీయం

సేద్య చట్టాల వెనక అసలు కుట్ర

ఏడాదికన్నా ఎక్కువ కాలం సాగిన రైతుల ఉద్యమాన్ని విరమింప చేయడానికి ప్రధానమంత్రి మోదీ క్షమాపణ చెప్పి ఉండొచ్చు. రైతు ఉద్యమ ఒత్తిడికి తట్టుకోలేక ఆ వివాదాస్పదమైన చట్టాలను వెనక్కి తీసుకుని ఉండవచ్చు. కానీ ఇప్పటికీ రైతుల సమస్యలు సంపూర్ణంగా పరిష్కారం కానేలేదు. రైతులు కోరినట్టు కనీస మద్దతు ధరకు చట్ట ప్రతిపత్తి కల్పించనే లేదు. ఈ తంతంగం అంతటి వెనక పెద్ద విద్రోహ చర్యే ఉంది. వివాదాస్పద వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకునే సమయంలో మోదీ క్షమాపణలు చెప్పినమాట నిజమే కానీ దాని వెనక కూడా పెద్ద దురుద్దేశమే ఉంది. 2021 నవంబర్ 21 రోజున సేద్య చట్టాలను వెనక్కు తీసుకుంటున్నట్టు ప్రధానమంత్రి మోదీ ప్రకటించడం, క్షమాపణ చెప్పడంతో పాటు మరో మాట కూడా అన్నారు. "మా తపస్సులో ఏదో లోపం ఉంటుందని వినమ్రంగా మనవి చేస్తున్నాను" అని కూడా ఆయన అన్నారు. "మేం రైతులకు సరిగ్గా నచ్చ చెప్పలేక పోయాం. ఆ చట్టాల ప్రయోజనాన్ని రైతులకు సరిగ్గా విడమర్చలేక పోయాం. అందుకే వారు ఉద్యమించారు. రిపోర్టర్స్ కలెక్టివ్ కు చెందిన శ్రీ గిరీశ్ జలిహల్ రాసిన దాన్ని బట్టి చూస్తే ఈ చట్టాలను తీసుకు రావడానికి ముందు జరిగిన తతంగం, రైతు ఉద్యమ ఒత్తిడివల్ల వెనక్కు తీసుకోవడానికి ఎన్ని కుట్రలు జరిగాయో బయటపడింది. బీజేపీకి సన్నిహితుడైన శరద్ మరాఠే అనే ఒక ప్రవాస భారతీయుడు వ్యవసాయాన్ని కార్పొరేటీకరించడానికి చేసిన పన్నాగాలను, ఆయన ప్రతిపాదనలను మోదీ ప్రభుత్వం అంగీకరించడం విచిత్రం అని కొట్టి పారేయగలిగినంత చిన్న కుట్ర కాదిది. వ్యవసాయంతో ఏ మాత్రం సంబంధంలేని వ్యక్తి సూచనలను, సలహాలను అక్షరాలా పాటించడంలో మోదీ ప్రభుత్వం బడా వ్యాపారులతో ఎంత లోతుగా కుమ్మక్కైందో చూస్తే మన విధానాలను ప్రభుత్వం నిర్ణయిస్తుందా లేక ప్రవాస భారతీయులు వారి వెనక ఉన్న బడా వ్యాపార వర్గాలు నిర్ణయిస్తాయా అన్న విషయం బహిర్గతం అవుతుంది. మోదీ తపస్సు వెనక కార్పొరేట్ వర్గాలు ఉన్నాయని తేలిపోతోంది. శ్రీ గిరీశ్ జలిహల్ ఈ విషయం బయటపెట్టి మూడు రోజులైనా ప్రభుత్వం ఖండించనూ లేదు. ఇది అసత్యం అని ప్రకటించనూ లేదు. బీజేపీకి సన్నిహితుడైన ఆ ప్రవాస భారతీయుడు వ్యవసాయాన్ని కార్పోరేటీకరించడానికి నీతిఆయోగ్ కు ఒక పథకం సూచించారు. దీనికోసం ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలన్నది ఆయన సూచన. తాను చెప్పినట్టు చేస్తే మోదీ వాగ్దానం చేసినట్టు రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని ప్రభుత్వాన్ని నమ్మించాడు. లేదా ప్రభుత్వమే ఇష్టపూర్వకంగా నమ్మేసింది. సదరు శరద్ మరాఠేకు వ్యవసాయంతో సంబంధం లేకపోవడమే కాదు. ఆయన కనీసం వ్యవసాయ రంగ నిపుణుడైనా కాదు. ఆయన ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ నడుపుతారు. అయితే తనకు సమాజాన్ని ప్రభావితం చేసే అంశాల మీదే ఎక్కువ ఆసక్తి అనీ, సాఫ్ట్‌వేర్ కంపెనీ నడపడం తన పాక్షిక వ్యాసంగమనని ఆయన సెలవిచ్చారు. రైతుల భూములను కార్పొరేట్ శైలిలో వ్యవసాయ వ్యాపారంగా మార్చాలన్నదే శరద్ మరాఠే సూచనలోని ప్రధానాంశం. ప్రభుత్వం ఆయన మాట జవదాట కుండా పాటించి వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చడానికి సంసిద్ధమైంది. ఆ రకంగా కార్పొరేట్ సంస్థలకు దాసోహమయింది. ఆ సంస్థలు చెప్పి నట్టల్లా వ్యవసాయ చట్టాలను రూపొందించింది. ఈ ప్రవాస భారతీయుడు సూచించినట్టు ప్రభుత్వం నీతిఆయోగ్‌లో ఒక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసింది. అందులో ఈ ప్రవాస భారతీయ పెద్ద మనిషిని కూడా చేర్చేశారు. రైతుల ప్రతినిధి ఒక్కరు కూడా లేరు. ఈ టాస్క్‌ఫోర్స్ రైతులెవరితోనో సంప్రదించలేదు. కేవలం బడా కార్పొరేట్‌సంస్థలను మాత్రమే సంప్రదించింది. ఈ సంస్థలన్నింటికీ వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యంతో సంబంధం ఉంది. ఈ టాస్క్‌ఫోర్స్ సంప్రదించిన వ్యాపారసంస్థల్లో అదానీ గ్రూపు, పతంజలి, బిగ్‌బాస్కెట్, మహేంద్ర, ఐ.టి.సి. లాంటివి ఉన్నాయి. రైతులతో చర్చించేదేమిటి అనుకోవచ్చు. కనీసం ఆర్థికవేత్తలను, రైతు సంఘాలవారినైనా సంప్రదించలేదు. ఈ కమిటీ 2018లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ప్రభుత్వం అప్పటికే 2022 నాటికల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఉదారంగా హామీ పడేసింది. ఈ టాస్క్‌ఫోర్స్ నివేదికను ఇప్పటిదాకా నీతీ ఆయోగ్ కానీ ప్రభుత్వం కానీ బయట పెట్టనే లేదు. సరిగ్గా రెండేళ్ల తరవాత సుదీర్ఘ ఆందోళన కొనసాగింది. ఆ ప్రవాస భారతీయుడైన పెద్ద మనిషి సూచన ప్రకారం వ్యవసాయ మార్కెట్లను ఎత్తివేయాలి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల ప్రభుత్వాలకు కూడా సూచన లాంటి ఆదేశం జారీచేసింది. ఆ ప్రవాస భారతీయుడు, నీతీ ఆయోగ్, కేంద్ర ప్రభుత్వ పన్నాగం ఏమిటో మహా మహులకే అర్థమై ఉండకపోవచ్చు. కానీ రైతులకు బోధపడింది కాబట్టే ఉద్యమించారు. ఆరేడు వందల మంది రైతులు ఈ క్రమంలో ప్రాణాలు వదిలారు. ఢిల్లీ పొలిమేరల్లో ఎముకలు కొరికే చలి, శరీరాన్ని కాల్చేసే ఎండను కూడా లెక్కచేయకుండా ఉద్యమం కొనసాగించడానికి కారణం వివాదాస్పదమైన వ్యవసాయ చట్టాలు ఎంత కీడు చేస్తాయో ఎవరు గ్రహించక పోయినా రైతులు సక్రమంగానే గ్రహించడమే. ఈ దుష్టచట్టాలను రద్దుచేసేదాకా భీష్మించుకు కూర్చున్నారు. 2017 నుంచే శరద్ మరాఠే తన పథకాన్ని అమలు చేయడానికి ఉపక్రమించారు. ఆయన నీతీ ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ కు ఓ లేఖ రాస్తే వ్యవసాయ రంగ ద్వారాలు వ్యాపారులకోసం బార్లా తెరిస్తే ఎంత మేలు జరుగుతుందో వివరించారు. ఈ లేఖను నీతీ ఆయోగ్ సుగ్రీవాజ్ఞలా భావించింది. సేద్యం మార్కెటింగ్ కు అనుకూలంగా మలచడానికి ఏమేం చేయాలో ఆ ప్రవాస భారతీయుడు సూచించారు. నీతీ ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్, మరాఠే సన్నిహితులు. అందుకే మరాఠే సూచనకు నీతీ ఆయోగ్ ఎగిరి గంతేసి ఈ ప్రతిపాదనను అంగీకరించింది. రాజీవ్ కుమార్ తో సాన్నిహిత్యానికి తోడు ఆ ప్రవాస భారతీయ పెద్ద మనిషి బీజేపీకి సైతం ఆత్మీయుడే. ఈ విషయం తెలియజేయడానికి ఒక్క ఉదాహరణ చాలు. అందుకే 2019లో స్పెయిన్‌లో గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ జాతీయ బ్యాంకు సమావేశం జరిగినప్పుడు ఆయన స్పెయిన్ రాకుమారిని కలుసుకోగలిగారు. మరాఠే 1960నుంచి అమెరికాలోనే ఉంటున్నారు. బీజేపీతో ఆయన సంబంధాలు కొత్తవేం కావు. వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు భారత్‌లో సాఫ్ట్‌వేర్ పార్కులు ఏర్పాటు చేయాలని వాజపేయికి సూచించింది ఈ పెద్దమనిషే. ప్రజలెన్నుకున్న ప్రభుత్వం రూపొందించే విధానాల వెనక ఇతరేతర శక్తుల ప్రమేయం ఉంటుందని, ఆ శక్తులు బడావ్యాపార వర్గాలకు ఊడిగం చేస్తాయని ఈ ఉదంతం మరోసారి నిరూపించింది.

తెలంగాణాలో ఉపాధ్యాయుల బదిలీలెప్పుడో....!

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వ్యవహారం తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులో నానుతోంది. బదిలీలు, పదోన్నతులకేసు హైకోర్టు బెంచ్ మీదకు రాగానే ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కేసు వాయిదా పడిందనగానే నిరాశ, నిస్పృహలకు గురౌతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సిద్ధంగానే ఉన్నప్పటికీ, కొంతమంది ఉపాధ్యాయులు తమకు అన్యాయం జరిగిందని కోర్టును ఆశ్రయించడంతో బదిలీలు, పదోన్నతులకు బ్రేక్ పడింది. ఈ నెల 23న హైకోర్టులో తుదివాదనలు ఉండడంతో గత 12,13 సంవత్సరాల నుండి ఒకే పాఠశాలలో పనిచేస్తూ గత ఐదు సంవత్సరాలుగా బదిలీలు, గత ఎనిమిది సంవత్సరాలుగా పదోన్నతులులేని ఉపాధ్యాయులు ఆశతో ఎదురుచూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చడం జీ.వో 317 పేరిట ఉద్యోగ, ఉపాధ్యాయులకు సర్దుబాటు పేరిట మారుమూల ప్రాంతాలకు కేటాయించడం స్థానికులైన ఉద్యోగ, ఉపాధ్యాయులు స్థానికేతరులుగా మారామని తమకు న్యాయం చేయాలని తెలంగాణ అత్యున్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించడం, హైకోర్టు స్టే విధించడం జరిగింది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కోసం గత సంవత్సరం వేసవి సెలవులకంటే ముందే నోటిఫికేషన్ జారీచేశారు. నోటిఫికేషన్‌లో గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలకు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు బదిలీలలో 10 పాయింట్లు కేటాయించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుండా వ్యక్తిగత ప్రయోజనాలకోసం పాఠశాలలకు రాకుండా ఉన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులకు అదనంగా 10 పాయింట్లు కేటాయించడం అన్యాయమని కొంతమంది ఉపాధ్యాయులు తెలంగాణ హైకోర్టుకువెళ్ళి స్టే తీసుకొని వచ్చారు. భార్యాభర్తలు ఒకే జిల్లాలో పనిచేస్తున్న వారు ప్రభుత్వ, పంచాయతీ రాజ్, ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్నట్లయితే భార్యకు పాయింట్లు ఇస్తున్నారు. భార్యకు పాయింట్లు కేటాయించడం అన్యాయమని, ఇతరులకు తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టుకు వెళ్ళి స్టే తీసుకొని వచ్చారు. బదిలీల విషయం పెద్ద చిక్కుముడుల సమస్యగా మారింది. తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్నట్లయితే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కేసును ఇప్పటికి ఐదు, ఆరుసార్లు వాయిదాపడింది. ఆగష్టు 23 నాడు చివరికి వాదనలు పూర్తిచేయాలని గడువు ఇవ్వడం జరిగింది. ఈసారి హైకోర్టులో బదిలీలు, పదోన్నతులకేసు కొలిక్కివచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముంచుకురావడం ఎన్నికలకోడ్ సమీపిస్తున్న తరుణంలో ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల కోసం కోర్టుల చుట్టూ, తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తెలంగాణలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పదోన్నతులులేక ఎనిమిది సంవత్సరాలు, బదిలీలు లేక ఐదు సంవత్సరాలు గడిచినందున బదిలీలు, పదోన్నతుల విషయంలో కోర్టు స్టే ప్రభుత్వానికి ముందుకు వెళ్ళడంలో ఇబ్బందిగా మారింది.

తెలంగాణలో ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో ఎలాంటి స్టే లేదు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ మేనేజ్‌మెంట్ వారిగా స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయవచ్చు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలే ఉండడంవల్ల ప్రభుత్వ, పంచాయతీరాజ్ కామన్ సీనియారిటీ గొడవ లేదు. ప్రభుత్వ పోస్టులను హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులచేత భర్తీ చేయడంలో ఎలాంటి ఆటంకాలుగాని, అడ్డుగోడలు లేవు. ఉపాధ్యాయులకు పదోన్నతులు లేకపోవడం వల్ల మూడు, నాలుగు పి.జీలు., పిహెచ్‌డిలు చేసినవారు కూడా ఉద్యోగంలో ఏ హోదాలో చేరారో అదే హోదాలో పదవీ విరమణ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు ప్రయోజనం కలగడానికి ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉంది.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్
సెల్: 9290826988

మహత్తర స్వాతంత్ర్యపోరాట వారసత్వ విచ్ఛిన్నం



డి. రాజా,
సీపీఐ ప్రధాన కార్యదర్శి

వలసపాలన నుంచి విముక్తికోసం శతాబ్ది కాలానికిపైగా పోరాటంచేసిన ఫలితంగా 1947 ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం పొందింది. బ్రిటీష్ పాలకుల సంకెళ్ల నుంచి విముక్తికోసం వేలాదిమంది సమరయోధుల ప్రాణత్యాగం ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించింది. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టులు తమ పోరాటపటిమని ప్రదర్శించారు. ఉద్యమం గొప్పమలుపు తిరగడానికి దోహదంచేసిన ఆర్ ఎస్ఐ తిరుగుబాటుపోరులో కమ్యూనిస్టులు పాల్గొని బ్రిటీష్ పాలకులు దేశంనుండి వెళ్లిపోవలసిన తప్పని పరిస్థితిని కల్పించారు. అలాగే స్వాతంత్ర్యోద్యమంలో సుభాష్ చంద్రబోస్, ఐఎన్ఏలు చరిత్రాత్మక పాత్ర నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన సమయంలో ఉపఖండంలో భారతదేశం, పాకిస్తాన్‌లుగా దేశం విడిపోయింది. బ్రిటీష్‌పాలనలో పొందిన కష్టాలు, దేశవిభజన, రెండుమతాల మధ్య వైరుధ్యాలు, హింస, లూటీలు, గృహ దహనాలు, హత్యలు అపరిమితంగా జరిగాయి. శతృత్వం పెరిగిపోయింది. ఇదే సమయంలో దేశంలో శాంతిస్థాపన కోసం కృషిచేశారు. దేశసమైక్యత కోసం, వందలాది సంస్థానాలను దేశంలో విలీనం చేయడానికి అత్యంత క్లిష్టమైన బాధ్యతను సర్దార్‌పటేల్ స్వీకరించారు. అదే సమయంలో తెలంగాణలో నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు విప్లవాత్మక పోరాటం నిర్వహించారు. ఇదే సమయంలో వందలాది మంది న్యాయశాస్త్ర గ్రంథాలను చదువుతూ, రాజ్యాంగ ముసాయిదాను తయారుచేసే పనిలో ఉన్నారు. మనకు స్వాతంత్ర్యం వచ్చిన 1947 ఆగస్టు 15వ తేదీన మన స్వాతంత్ర్యపోరాటం నడిపిన నాయకుడు కలకత్తాలోనే ఉన్నారు. దేశ ఈశాన్యప్రాంతాల్లో రక్తం ఏరులై పారుతోంది. స్వాతంత్ర్యం సిద్ధించిన శైశవదశలో మన దేశప్రజల్లో కలిగిన భయాన్ని తొలగించి, మతఘర్షణల గాయాలను ఉపశమింపచేసేందుకుగాను మహాత్మాగాంధీ ఆ ప్రాంతాల్లో పర్యటించారు. అత్యంత అధికంగా మతఘర్షణల మారణహోమం జరిగిన నౌఖలికి (ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉంది). మహాత్మాగాంధీ వెళ్లారు. నౌఖలిలో మృతదేహాల మధ్యనే తిరిగారు. అత్యాచారాలకు గురైన మహిళలను ఓదార్చారు. తూర్పు పాకిస్థాన్‌ను ఏర్పాటు చేసినందుకు ఆగ్రహోదగ్రులైన సమూహాల బారినుంచి మైనారిటీలను రక్షించేందుకు ఆయన పర్యటించారు. ఆయన చేసిన విజ్ఞప్తి ఫలించింది. దేశప్రజలు మత ఘర్షణలకు పాల్పడటంపై ఎంతో ఆందోళన చెందారు. మతోన్మాదులైన వెర్రెత్తిపోయారు. ఆ సమయంలో గాంధీ మహాత్ముడు చేసిన నిరాహారదీక్ష ప్రజాసమూహాలపైన బాగా పనిచేసింది. రెండు మతాలకు చెందిన నాయకులు, ప్రజలు శాంతిని నెలకొల్పుతామని, ఇతర మతప్రజలను రక్షిస్తామని వాగ్దానం చేశారు. మహాత్ముడి ధైర్యసాహసం, ప్రజల ఐకమత్యంపై దృఢవిశ్వాసం, లౌకికవాదం, పరస్పరగౌరవం మధ్య వారధిగా నిలిచాయి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తొలిదశలో భిన్నమతాల ప్రజలు స్పందించి మొదట తీసుకున్న చర్యలివి. ఆ తర్వాత వెంటనే ఆయన దేశ వాయవ్య ప్రాంతాలలో శాంతి, సామరస్యతలను నెలకొల్పి ప్రజలను సన్నిహితపరిచే లక్ష్యంతో మహాత్ముడు వెళ్లారు. ఆనాడు మేవాత్ (ప్రస్తుతం హర్యానాలో ఉంది)



యూపీ, రాజస్థాన్‌లలో మంటలు ఉవ్వెత్తున లేచాయి. మతహింస చెలరేగుతుందని సందేహించిన ముస్లింలు పాకిస్థాన్‌కు పారిపోడానికి సిద్ధమయ్యారు. అల్వార్, భరత్‌పూర్‌లో అత్యంత విషాదకర ఘటనలు చోటుచేసుకున్న తర్వాత ముస్లింలలో ఆందోళన మరింతగా పెరిగింది. ఎంఐఓ నాయకుడు చౌదరి యాసిన్‌ఖాన్ ఒత్తిడితో గాంధీ దాడులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించేందుకు సిద్ధమయ్యారు. 1947 డిసెంబరులో వణికించే చలిలోనే ఆయన గుర్గావ్ సమీపంలోని ఘసిర గ్రామాన్ని సందర్శించారు. అక్కడ ప్రజాసమూహాలను ఉద్దేశించి చేసిన ప్రసంగం మైనారిటీలను రక్షించేశక్తి, స్థోమతలు భారతదేశానికి ఉన్నాయన్న నమ్మకాన్ని కలిగించింది. "నాకు నిజమైన అధికారం ఉంటే ఒక్కరిని కూడా పాకిస్థాన్‌కు వెళ్లకుండా నిరోధించే వాడిని" అని గాంధీ అన్నారు. భారతదేశం మీది అని వారిలో విశ్వాసం కల్పించిన గొప్ప శాంతిదూత అన్నారు. గాంధీకి మైనారిటీలు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నారు. "ఆజాదీకా అమృత మహోత్సవ్" వేడుకలు ఏడాదికాలం ముగియనున్న దశలో ప్రస్తుతం ఆనాటి పరిస్థితని ఎదుర్కొంటున్నాము. జాతుల మధ్య హింసాయుత ఘర్షణలతో మణిపూర్ మంటల్లో చిక్కుకుంది. మే 3వ తేదీన మొదలైన మంటలు రాష్ట్రం మొత్తాన్ని చుట్టుముట్టాయి. వేలమంది తన నివాసాలు వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. దాదాపు రాష్ట్ర ప్రజలంతా సహాయశిబిరాల్లో ఉంటున్నారు. వారిపై సహానుభూతి, ప్రేమ, ఆదరణ చూపడం గొప్ప రాజనీతిజ్ఞత అవుతుంది. అయితే ఉన్నతస్థానాలు అలంకరించి అధికారం చెలాయిస్తున్న వారిలో ఇవేకొరవడ్డాయి. ఆనాడు గాంధీ మహాత్ముడు చూపిన ధైర్యసాహసం, సమైక్యతకోసం పడిన ఆందోళన లేకపోగా తగువలు సృష్టించడం, విడదీయడం బీజేపీ వంతుగా ఉంది. మహిళలను నగ్నంగా ప్రదర్శించని సిగ్గుచేటైన వీడియోను చూసిన తర్వాతనైనా ప్రధానమంత్రి మోదీ మణిపూర్‌పై నోరువిప్పలేదు.

కేంద్ర హోంశాఖ మంత్రి మాట్లాడుతూ, హైకోర్టు ఉత్తర్వువచ్చిన తర్వాతనే అగ్నికి ఆజ్యం పోసినట్టుగా మంటలు చెలరేగాయని, అంతక్రితంలేదని వాస్తవాన్ని అంగీకరించారు. సమాజం మండిపోతుంటే ప్రభుత్వం నిద్రపోతుందా? విద్వేషమంటలు చెలరేగడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీల డబుల్ ఇంజిన్ ఉండనేఉంది. వ్యూహాత్మకంగా కీలకప్రాంతంలో ఉన్న రాష్ట్రంలో ఎన్నికల్లో గెలవడంకోసం ప్రజలను విడదీశారు. ఇప్పుడు దేశప్రజలంతా మూల్యం చెల్లిస్తున్నారు. గాంధీ మాదిరిగా కనీసం అక్కడి ప్రజలకు సానుభూతికూడా ప్రకటించలేదు. కల్లబొల్లి మాటలు, చెప్పింది పదేపదే చెప్పడం వల్ల గాయాలు మానవు. బాధితులు ఊరటచెందరు. ఇక హర్యాన విషయం చూద్దాం. అక్కడ మతవాదులు ఆయుధాలు ఉపయోగిస్తున్నారన్నదని చెప్పడానికి తిరుగులేని తార్కాణంగా చెప్పవచ్చు. ఆర్ఎస్ఎస్ దీని వెనుకఉన్నది. జులై 31వ తేదీన ఆరుగురు హతులయ్యారు. సంఘపరివార్‌లో భాగమైన వీహెచ్‌పీ నిర్వహించిన మతప్రదర్శనకు పెద్దసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిస్తూ, గోసరంక్షకుడిగా చెప్పుకున్న వ్యక్తి సోషల్ మీడియాలో వీడియోను ప్రసారం చేశాడు. బజరంగ్‌దళ్‌కు చెందిన విచ్ఛిన్నకారుడు ఇద్దరు ముస్లింలను కిడ్నాప్‌చేసి చంపాలనుకున్నాడు. కాలిపోయిన ఒకకారులో ఆ ఇద్దరు ముస్లింల మృతదేహాలు కనిపించాయి. ఈ ఘటన జరిగిన ప్రాంతంలో శాంతి ఉండదు. దాడులకు పాల్పడిన దుండగులు విచ్చలవిడిగా తిరుగుతూ హింసాకాండకు పాల్పడ్డారు. దహనాలు, రాళ్లు విసరడం నిత్యకృత్యమయ్యాయి. ఇవి ఎందుకు జరుగుతున్నాయో పాలకులు చెప్పాలి. పరస్పరం విశ్వాసం కల్పించే చర్యలు తీసుకోవాలి. విద్వేషంతో ఇళ్లు కూల్చివేతలకు పాల్పడుతున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలు హింసను, అల్లర్లు సృష్టించిన ప్రాంతంలో ఆనాడు గాంధీ శాంతిని నెలకొల్పారు. మనదేశం, నాయకులు పరీక్ష నెదుర్కొంటున్న సమయంలో బ్రిటీషు పాలకుల నుండి మనకు స్వాతంత్ర్యం లభించింది. ఈ దశలోనే భారీ సంఖ్యలో వలసలు చోటుచేసుకున్నాయి. గాంధీ, నెహ్రూ,పటేల్,అంబేద్కర్ అనేకమంది కమ్యూనిస్టు విప్లవకారులు, ప్రజలు సవాళ్లను ఎదుర్కొని నిలిచారు. పేద దేశమైన భారతదేశంలో ప్రజాస్వామ్యం నిలుస్తుందా అని ప్రపంచమంతా సందేహించింది. ఇటీవల చోటుచేసుకుంటున్న మతహింసాకాండ సైతం ఆనాటి సందేహాన్నే కలగచేస్తున్నది. ఇప్పటికీ మన నాయకులు అవిశ్రాంతంగా భారతదేశ సెక్యులర్, ప్రజాస్వామ్య సంక్షేమరాజ్య పునాదులను పరిరక్షించేందుకు కృషిచేస్తున్నారు.

భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా మనగలుగుతుందా అని సందేహిస్తున్న వారంతా విదేశీయులు కాదు. గోల్వాల్కర్, సావర్కర్‌ల అనుచరులకు ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంపై నమ్మకంలేదు. సెక్యులరిజం, హిందు-ముస్లిం ఐక్యతను కోరుకున్న గాంధీ ప్రాణాలను హరించారు. స్వాతంత్ర్య సమరయోధులు త్యాగాలుచేసి నిర్మించిన బలమైన ప్రజాస్వామ్యం నెలకొని ఉన్న 2014లో నరేంద్ర మోదీ అధికారం చేపట్టారు. గడచిన తొమ్మిదేళ్లకాలంలో ప్రజల ఆకాంక్షలను, ఆశలను విచ్ఛిన్నం చేశారు. గతంలో ఉన్న ఆదరణ, ధైర్యం నేడు ఎక్కడా కనిపించడంలేదు. ఆర్ఎస్ఎస్, బీజేపీ పాలనలో ఇవి మృగ్యమయ్యాయి. నేడు అమూల్యమైన మన స్వాతంత్ర్యానికి సవాలు ఎదురైందన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలి. ఇండియా భావనను ప్రస్తుతం పాలకులు ఎంతమాత్రం సహించేలాగాలేరు. ఐక్యంగా బ్రిటీషు పాలకులపై జయించిన ప్రజలు బ్రిటీష్ తొత్తులను కూడా ఓడిస్తారు. గాంధీ, నెహ్రూ, పటేల్, అంబేద్కర్‌ల స్ఫూర్తితో గోల్వాల్కర్, సావర్కర్ విద్వేషపూరిత భావజాలాన్ని ఓడించడానికి తగిన బలం ఉందని నిరూపించగలరు.

జాతీయ వైజ్ఞానిక స్పృహ అవశ్యం



డాక్టర్ దేవరాజు మహారాజు

చుట్టూ ఉన్న కోటాను కోట్ల జీవరాసుల మధ్య తనకు ఈ జీవితం ఎక్కడి నుంచి వచ్చిందన్నది ఆది మానవుడికి ఒక పట్టాన అంతుపట్టలేదు. మొదట అదొక నిగూఢమైన రహస్యం అనుకున్నాడు. తర్వాతకాలంలో తన ఊహకు అందని ఏదో అమోఘమైనశక్తి ఈ విశ్వాన్నంతా ఒకేసారి, ఉన్నఫళంగా సృష్టించి ఉంటుందని భావించాడు. అదే ఇంత అద్భుతంగా తయారైందని విశ్వసించాడు. అందుకే, ప్రతి మతంలోనూ 'సృష్టి' ప్రస్తావన కనిపిస్తుంది. దేవుడి పేర్లూ, మతాలూ వేరువేరైనా, ప్రపంచవ్యాప్తంగా దాదాపు అందరూ నమ్మింది ఒకే విషయం! దేవుడే ఈ విశాల విశ్వానికి సృష్టికర్త" అని!! ఆ భావం కొన్ని వేలసంవత్సరాలపాటు వర్ధిల్లింది. సృష్టికి సంబంధించిన విషయంలో మతాలు చెప్పిందే ఆయా సమాజాల్లో 'సత్యం'గా చలామణీ అయ్యింది. మత గ్రంథాలు ప్రామాణికమయ్యాయి. అందువల్ల ఆ విశ్వాసాన్ని కాదని, ఆలోచించే వారే లేకపోయారు. ఎవరైనా వ్యతిరేకంగా నోరెత్తితే ఏకంగా మరణశిక్షలే ఉండేవి. అందువల్ల శాస్త్రీయదృక్పథం అనేది ఊపిరి పోసుకోవడానికి కొన్ని శతాబ్దాలు పట్టింది. వివేకానికి మూర్ఖత్వం పెద్ద ప్రతిబంధకంగా నిలిచింది. మరోవైపు మత పెద్దల, మత న్యాయస్థానాల తీర్పులు జనాన్ని భయకంపితుల్ని చేశాయి. తెల్లవాడు నల్లవాణ్ణి, ఉన్నవాడు లేనివాణ్ణి, అగ్రవర్గం వాడు నిమ్నవర్గంవాడిని, పురుషుడు స్త్రీని బానిసలుగా చూసే హీన సంస్కృతి రాజ్యమేలింది. పైస్థాయివారు కిందిస్థాయి వారిని ఎంతగా ప్రభావితం చేశారంటే- "తాము పాపులం గనక, ఆ దేవుడు - ఆ ప్రభువు తమను బానిసలుగా పుట్టించాడని, అంతా ఆ దేవుని ఇష్టప్రకారమే జరుగుతూ ఉందని, యజమానులకు సేవలుచేస్తూ తరించడమే తాము చేయాల్సిఉందని అమాయకంగా నమ్ముతూ మోసపోయారు. పదిహేను, పద్దెనిమిది శతాబ్దాలలో కోపర్నికస్, గెలీలియో, బ్రూనో, న్యూటన్, అల్, డార్విన్, హట్టన్ వంటి వైజ్ఞానికులు విశ్వనిర్మాణం, జీవ పరిణామం విషయాలలో కొత్త సిద్ధాంతాలను ముందుకు తెచ్చారు. మతవిశ్వాసాలకు బలమైన సవాళ్లు విసిరారు. ఎదుర్కోవడానికి స్థిరంగా నిలబడ్డారు. ఈ విశ్వాన్ని నడిపిస్తున్న సూత్రాలేమిటో నిశితంగా పరిశీలిస్తే, మనకు ఈ విశ్వంలోనే కనిపిస్తాయని నిరూపిస్తూ వచ్చారు. దీనితో జనంలో రెండు ప్రశ్నలు తలెత్తాయి. ఒకటి -మతం చెప్పింది విశ్వసించడమా? రెండు -సైన్సు చూపిన మార్గాన్ని అనురించడమా? ఇవి రెండూ ప్రజల మధ్య చర్చకు దారితీసాయి. ఆనాడే కాదు, శతాబ్దాలు దాటొచ్చినా, ఈ చర్చలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. సంస్కృతి, సంప్రదాయం, ఆచారం పేర్లతో ప్రపంచంలో ఎక్కువ శాతం మంది మూఢ నమ్మకాల్లో మగ్గిపోతూ ఉన్నారు. అదే సమయంలో శాస్త్ర,సాంకేతిక ఫలితాలను పూర్తిగా అనుభవిస్తున్నారు. వైజ్ఞానిక రంగం అందించిన అన్ని వసతుల్ని ఒకవైపు అనుభవిస్తూనే, ఇంకా ఎందుకు మూడువేల నాటి పనికిరాని భావజాలాన్ని పట్టుకుని వేళ్లాడుతున్నారూ? అన్నది నేటి సైన్సు కార్యకర్తల ప్రశ్న. దేన్ని అనుభవిస్తున్నారో దానిపట్ల నిజాయితీగా ఉండనవసరంలేదా? నిజాయితీ లేక అబద్ధపు బతుకులు బతికేవారిని ఏమనాలి? క్రీ.శ.1700 నుంచి వైజ్ఞానికులు భూమి పొరల్లో కొన్ని కొన్ని చోట్ల శిలాజాలను గుర్తిస్తూ వచ్చారు. క్రమంగా ఏ శిలాజం ఏ జంతువుదో గుర్తించగలిగే నైపుణ్యాన్ని పెంచుకున్నారు. అందులో కొన్నిరకాల వృక్షాలు, జంతువులు తర్వాతికాలాలలో జీవించి లేవని గుర్తించారు. ఈ విషయంలో పరిశోధనలింకా జరుగుతూనే ఉన్నాయి. జార్జి కువిర్ (1769-1832) అనే ఫ్రెంచ్ ప్రకృతి పరిశోధకుడు గతంలో జీవించిన కొన్ని ప్రాణాలు అంతరించి పోయాయయని ప్రతిపాదించాడు. అదువల్ల ఈ 'అంతరించి పోవడ' మనే విషయం వెలుగులోకి వచ్చింది. అంతేకాదు, అదొక ముఖ్యమైన అధ్యయన విషయమైంది. జేమ్స్ హట్టన్ స్కాట్‌లాండ్ భూగర్భ శాస్త్రవేత్త 1788లో భూసిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. భూమి పొరలు పొరలుగా ఉందని, దాని సారాంశం! అది నిజమే అన్ని నిర్ధారణ అయింది. ఎందుకంటే ఒక్కోపొరలో వృక్ష,జంతు శిలాజాలు లభ్యమవుతూ ఉండడంవల్ల అవి ఏయే కాలాలలో జీవంచి ఉండేవో లెక్కలు కట్టడానికి వీలైంది. మత గ్రంథాల్లో చెప్పినట్లుగా ఒక్కసారిగా మహాప్రళయాలు రావడంలేదని అవి క్రమేపి కొన్న వందల, వేలయేళ్లపాటు జరుగుతూనే ఉంటాయని బ్రిటీష్ భూ భౌతికశాస్త్రత్త చార్లెస్ లిల్(1797-1875) ఉదాహరణలతో సహా ప్రతిపదించాడు. ఛార్లెస్ లిల్, జేమ్స్ హాట్టన్ భూ సిద్ధాంతానికి ప్రాచుర్యం తెచ్చారు. ఈ ఇద్దరి పరిశోధనా ఫలితాలు ఛార్లెస్ దార్విన్‌కు ఉపయోగపడ్డాయి. ఇవేకాక, ఇంకా ఇతర సిద్ధాంతాలెన్నో దార్విన్‌కు ఉపయోగపడ్డాయి. దార్విన్‌కు సమాంతరంగా ఆల్‌ఫ్రెడ్ రస్సెల్ వాలెస్ కూడా జీవపరిణామ క్రమంపై పరిశోధనలు చేశాడు. విలియం



స్మిత్-ఇంగ్లాండ్ జియోలజిస్ట్ తొలిసారి 'ఇంగ్లాండు-వేల్స్‌ల జియోలాజికల్ మ్యాప్' ప్రకటించారు.

దేవుడు చేసిన ఈ సృష్టిలో ఎలాంటి మార్పులు ఉండవని ప్రజలు నమ్మేవారు. యుగాంతంలో సర్వం నాశనమైపోయి, మళ్లీ మళ్లీ జీవాలు పుడుతాయని విశ్వసించేవాళ్లు, ఆ రోజుల్లో ప్రయాణ సౌకర్యాలు ఏవీ లేకపోవడంతో ఇతర ప్రాంతాలు తిరిగి చూసే వీలుండేదికాదు. తమ చుట్టుప్రక్కల ఉన్న వృక్ష, జంతు జాతుల్ని మాత్రమే చూస్తూ 'జీవాల్లో మార్పేమీ ఉండదు' అని అనుకునేవారు. పారిశ్రామిక విప్లవం వల్ల రవాణా సౌకర్యాలు పెరిగాయి. రవాణా సౌకర్యంతోపాటు వ్యాపారాలు పెరిగాయి. వ్యాపారులతో పాటు ప్రయాణాలు పెరిగాయి. ప్రయాణాలు పెరగడంవల్ల మనుషులకు వేర్వేరు ప్రాంతాల్లోని జీవ వైవిధ్యాన్ని గమనించడానికి వీలైంది. కొత్త విషయాలు గ్రహించడానికి, కొత్తగా ఆలోచించడాదనికి అవకాశం వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా మనుషులు తమ చుట్టూఉన్న పరిసరాలు, పరిస్థితుల్ని గమనిస్తూ ప్రకృతి నుండి కొత్త విషయాలు నేర్చుకుంటూ వచ్చారు. ఒక్కొక్క మెట్టెక్కి మేడపైకి చేరుకున్నట్లు ఒక్కొక్క అవిష్కరణతో మానవ జీవితాన్ని సుఖమయం చేసుకుంటూ వస్తున్నారు. వ్యవసాయం,ఆహార,ఆహార్యం రవాణా, వైద్య, విద్య, సంక్షేమం వంటి అన్ని రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చుకున్నారు. పూర్తిగా జీవనశైలినే మార్చుకున్నారు. మనుషులంగనక, మనుషుల్ని ప్రేమించాలి. వర్ణ,వర్గ,లింగ ప్రాంతీయ బేధాలు లేకుండా, మానవజాతి అంతా ఒక్కటేనని నినదించాలి' అని అంటున్నారు. కాని, కొందరు స్వార్థపరులు, కుట్రదారులు మనిషిని మనిషితో కలవకుండా విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆ విషయంలో అందరూ అప్రమత్తులై ఉండాలి. మనిషిని కాదు-మనిషిలోని స్వార్థాన్ని చంపితే, నిస్వార్థం పెల్లుబికివస్తుంది. ఎక్కువమంది నమ్మే అబద్ధం ఏనాటికీ సత్యంగా మారిపోదు. వారు అలా అబద్ధాన్ని నమ్మడానికివారి అవగాహనా రాహిత్యమో, అమాయకత్వమో, అవివేకమో, లేక మూర్ఖత్వమో కారణం కావొచ్చు. తక్కువమంది నమ్మే సత్యం ఏప్పటికీ అబద్ధంకాదు. హేతుబద్ధంగా తననితాను నిరూపించుకుని, తగిన కారణాల్ని చూపించినప్పుడే, విశ్లేషణలకు, వివరణలకూ అవకాశమిచ్చినప్పుడే అది వాస్తవమవుతుంది. సత్య నిరూపణ అంటే ఇదే. సత్యశోధన అంటే ఇదే. ఛాందసులు నమ్మే సత్యశోధన, సత్యాన్వేషణ వేరు. వాటిలో దీనికి సంబంధం లేదు. ఏ నిరూపణలకూ నిలబడకుండా తమ విశ్వాసాల్ని గుడ్డిగా నమ్మమని బోధించేవి ఏవైనా సరే, అవి అబద్ధాలవుతాయి. సత్యం సత్యమే! అసత్యం అసత్యమే! వీటిని నమ్మేవారి సంఖ్యతో మనకు పనిలేదు. అబద్ధాలు రాజ్యమేలినా, వాటిలోని డొల్లతనం శతాబ్దాలుగా బైటపడుతూనే ఉందికదా? మనోభావాల్ని అడ్డపెట్టుకుని, అబద్ధాల్ని సత్యాలుగా ఎల్లకాలం చలామణి చేయలేరు. నానాటికీ జనంలో వివేకం పెరుగుతున్న దశలో గుడ్డి నమ్మకాల్ని వ్యాప్తి చేయాలనుకోవడం బుద్ధి తక్కువపని. ఏకాలంలోనైనా, ఏ సమాజంలోనైనా వైజ్ఞానికులు, హేతువాదులు కొద్దిమందే ఉన్నారు. ప్రపంచంలో మార్పువారితోనే సాధ్యమవుతూ వచ్చింది. నిత్యజీవితంలోని అన్ని రంగాల్లో వస్తున్న అన్ని మార్పులకు కారణం వీరే. ఆలోచించకుండా ఒక ప్రవాహంలో కొట్టుకుపోయే జనం కొన్ని మిలియన్లమంది ఉండొచ్చుగాక, వారితో సమాజంలో ఏ మార్పూ రాలేదు. ఇక ముందు కూడా రాదు. తమ మానసిక బలహీనతలతో, కొన్ని భ్రమలకు లోనై, అదే వాస్తవమనుకుని, దైవ శక్తుల్ని, మతాల్ని , సంబంధించిన గ్రంథాల్ని నమ్ముకుంటూ అధిక సంఖ్యాకులు జీవితం వృథా చేసుకుంటూ ఉంటారు. భక్తి అనేది మోసానికి, వ్యాపారానికి, దోపిడీకి పర్యాయపదాలైన తర్వాత కూడా, ఇజం గ్రహించలేని అచేతనుల్ని ఏమందాం? మూఢనమ్మకాల నిర్మూలనకోసం కృషిచేస్తూ, హత్యకుగురై, అమరుడైన డా.నరేంద్ర దబోల్కర్ స్మృతిలో 20ఆగస్టు జాతీయ వైజ్ఞానిక స్పృహదినంగా పరిగణిస్తున్నాం

సుప్రసిద్ధ సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

రతన్ టాటాకు 'ఉద్యోగరత్న' ప్రదానం

ముంబై: పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాను మహారాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగరత్న అవార్డుతో గౌరవించింది. పారిశ్రామిక, ఉపాధి కల్పనా రంగాల్లో విశిష్ట సేవలు అందించినందుకుగాను ఆయనకు 'ఉద్యోగ రత్న' పురస్కారాన్ని ప్రదానం చేసింది. దక్షిణ ముంబైలోని కొలాబాలో ఉన్న టాటా నివాసానికి వెళ్లిన మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎంలు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్...85 ఏళ్ల టాటాను కలిసి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఉపాధి కల్పనా రంగాల్లో విశేష సేవలందించే పారిశ్రామికవేత్తలను గౌరవించేందుకు ఈ ఏడాదే మహారాష్ట్ర ప్రభుత్వం ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. మహారాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ తరపున శాలువా, ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను అందజేసి రతన్ టాటాను సన్మానించారు.

అవార్డుకు గౌరవం పెరిగింది: సీఎం

రతన్ టాటాకు 'ఉద్యోగ రత్న' పురస్కారం అందించడం ద్వారా ఆ అవార్డుకే మరింత గౌరవం పెరిగిందని సీఎం ఏక్‌నాథ్ షిండే వ్యాఖ్యానించారు. దేశంలో అనేక రంగాల్లో టాటా గ్రూపు సహకారం అపారమైందని, టాటా అంటేనే నమ్మకమని కొనియాడారు. ప్రపంచంలో100కి పైగా దేశాల్లో టాటా గ్రూపు ఉక్కు నుంచి ఉప్పు దాకా వ్యాపార రంగంలో తనదైన ముద్రవేస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నదన్నారు.

ప్యాంగాంగ్ సరస్సుకు రాహుల్ బైక్ రైడ్

లద్దాఖ్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ప్యాంగాంగ్ లేక్ దగ్గరకు రాహుల్‌గాంధీ డ్యూక్ బైక్‌పై వెళ్లారు. ఆయన వెంట కొందరు బైక్ రైడర్లు ఉన్నారు. కొండ ప్రాంతంలో రాహుల్ బైక్ రైడింగ్ చేస్తున్న ఫొటోలను కాంగ్రెస్ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా అవి వైరల్‌గా మారాయి. ఈ ఫొటోల్లో రాహుల్ గాంధీ హీరోలా ఉన్నారంటూ నెటిజన్‌లు కామెంట్ చేస్తున్నారు. లద్దాఖ్ పర్యటన సందర్భంగా రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. 'ప్రపంచంలోనే అందమైన ప్రదేశాల్లో పాంగాంగ్ సరస్సు ఒకటని మా నాన్న ఎప్పుడూ చెప్పేవారు. ఇప్పుడు అక్కడికే వెళ్తున్నా' అని ఆయన పేర్కొన్నారు. ఈనెల 20న తన తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పాంగాంగ్ సరస్సు దగ్గరే రాహుల్ గాంధీ జరుపుకుంటారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. గత గురువారం రాహుల్‌గాంధీ లేహ్ పర్యటనకు వెళ్లారు. తొలుత రెండు రోజులు మాత్రమే లేహ్‌లో ఉండాలని భావించినా...ఆగస్టు 25 వరకు ఆయన తన పర్యటనను పొడిగించుకున్నారు. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత రాహుల్‌గాంధీ లేహ్ పర్యటనకు రావడం ఇదే తొలిసారి.

ఆఫీసులకు రాకుంటే ఇంటికే...మెటా

న్యూయార్క్ : కరోనా సమయంలో ఆరంభమైన వర్క్ ఫ్రమ్ హోమ్ వాతావరణం నుంచి ఇంకా కొందరు ఉద్యోగులు బయటకు రావటం లేదు. వారానికి మూడు రోజులు కార్యలయాలకు వచ్చి పని చేయాలని ఇప్పటికే అనేక సంస్థలు ఆదేశిస్తున్నా... ఉద్యోగులు పట్టించుకోవడం లేదు. దాదాపు అన్ని సంస్థల్లో ఇలాంటి పరిస్థితే కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో మార్క్ జుకర్ బర్గ్‌కు చెందిన మెటా సంస్థ ఉద్యోగులకు హెచ్చరికలు జారీ చేసింది. వారంలో మూడు రోజులు ఆఫీసుకు రావాలని ఆదేశించింది. సంస్థ ఆదేశాలను ఉల్లంఘిస్తే... ఇక ఇంటికే వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించింది. వచ్చే నెల 5 నుంచి వారానికి మూడు రోజుల పాటు ఆఫీసులకు వచ్చి పనిచేయాల్సిందేనని ఉద్యోగులకు జారీ చేసిన నోటీసులో మెటా హెచ్చరించింది. కార్యాలయాలకు వస్తున్నదీ లేనిదీ తనిఖీ చేయాలని మేనేజర్లకు సూచించింది. ఉద్యోగుల మధ్య బంధాలు బలోపేతం చేయడానికి టీమ్ వర్క్‌కు ఈ నిర్ణయం దోహదపడుతోందని నోటీసులో పేర్కొంది. అయితే ఈ నిర్ణయం నుంచి రిమోట్ ఉద్యోగులను మెటా మినహాయించింది. ఆఫీసుల ఉంటూ పని చేస్తేనే మంచి పురోగతి సాధించగలుగుతాం.. ఇంట్లో ఉంటూ వర్క్ చేసే వారి కంటే ఆఫీసుకు వచ్చి పని చేసే వారే మంచి ఫలితాలను పొందుతున్నారని జుకర్ బర్గ్ గతంలోనే ఓ సందర్భంలో ఉద్యోగులతో అన్నారు.

రెండు రైళ్లలో మంటలు...ప్రయాణికులు సురక్షితం

మహారాష్ట్ర: మహారాష్ట్రలో తెలంగాణ ఎక్స్‌ప్రెస్, కర్నాటకలో ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్‌లో శనివారం మంటలు చెలరేగాయి. తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో ఘోరప్రమాదం తప్పింది. మహారాష్ట్రలో ప్రయాణిస్తున్న ఈ రైల్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎస్-2 బోగీలో మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన సిబ్బంది రైలును నాగపూర్ సమీపంలో నిలిపివేయడంతో ప్రయాణికులు బోగి నుంచి కిందకు దిగి పరుగులు తీశారు. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. మరోవైపు, కర్నాటక రాజధాని బెంగళూరులోనూ ఓ రైలుకు ప్రమాదం తప్పింది. కేఎస్ఆర్ రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. క్షణాల్లో మంటలు వ్యాపించి దట్టమైన పొగ అలుముకుంది. అయితే ప్రయాణికులు రైలు నుంచి దిగిన రెండు గంటల తర్వాత ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారమందుకున్న రైల్వే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని రైల్వే అధికారులు వెల్లడించారు.

ఇంధన ధరలు తగ్గించం: కేంద్రమంత్రి పురి

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరలు తగ్గిస్తుందనేది అపోహమాత్రమేనని పెట్రోలియంశాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి స్పష్టం చేశారు. ఓ వార్తాసంస్థ శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల ముందు ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఇంధన ధరలు తగ్గిస్తారా అని అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ ఇది కేవలం ప్రచారమేనని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. అంతర్జాతీయ చమురు ధరలు, రవాణా ఖర్చులు, రిఫైనింగ్ వ్యయం, పన్నులు వంటి అనేక అంశాలు ఇంధన ధరలను నిర్దేశిస్తాయని కేంద్ర మంత్రి వివరించారు. ఇటువంటి అంశాలను ప్రభుత్వం ఎలా నిర్వహిస్తుందనే దానిపైనే ఇంధన ధరలు ఆధారపడి ఉంటాయన్నారు. కరోనా మహమ్మారి అనంతరం 2022లో చమురు ధరలు పెరిగిన సమయంలో... ధరలు తగ్గించాలని చమురు సరఫరా చేసే దేశాలను భారత్ అడగలేదని, బదులుగా ఎక్సైజ్ పన్ను తగ్గించి వినియోగదారులకు ఉపశమనం కల్పించినట్లు గుర్తుచేశారు. గతేడాది జూన్ నుంచి దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి హెచ్చుతగ్గులు లేవని కేంద్రమంత్రి పురి ఇటీవల లోక్‌సభలో వెల్లడించారు. 2021 నవంబరులో, 2022 మే నెలలో రెండు విడతలుగా కేంద్ర ప్రభుత్వం ఇంధనంపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని, ఫలితంగా పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు తగ్గాయని లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. అంతేకాకుండా బీజేపీ పాలిత రాష్ట్రాలు ఇంధనంపై వ్యాట్ తగ్గించాయని, దీంతో ధరలు మరింత తగ్గాయని చెప్పారు.

హేమంత్ సొరేన్‌కు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో దర్యాప్తునకు హాజరుకావాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీ చేసింది. ఈ నెల 24న హాజరుకావాలని ఆదేశించింది. ఈడీ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా శనివారం ఈ వివరాలు తెలిపింది. భూ కుంభకోణం కేసులో దర్యాప్తునకు ఈ నెల 14న హాజరుకావాలని అంతకుముందు సొరేన్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది. కానీ ఆయన హాజరుకాలేదు. స్వాతంత్ర్య దినోత్సవాల కోసం తీరిక లేకుండా పనిచేస్తున్నానని, అందువల్ల తాను దర్యాప్తునకు హాజరుకాలేనని ఈడీకి సమాచారం ఇచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాలకు ముందు రోజు రావాలని తనను పిలవడం తనను ఆశ్చర్యపరచలేదని సొరేన్ అన్నారు. తాను కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా లేనందువల్లే తనను కేంద్ర దర్యాప్తు సంస్థలు లక్ష్యంగా చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సాహెబ్‌గంజ్‌లో చట్టవిరుద్ధంగా గనులు తవ్వినందుకు కేసు నమోదైంది. దాదాపు రూ.1,000 కోట్లు విలువైన గనులను అక్రమంగా తవ్వినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. ఈ కేసులో గత ఏడాది నవంబరులో సొరేన్‌ను ఈడీ ప్రశ్నించింది. ఆయన సన్నిహితుడు పంకజ్ మిశ్రాను అరెస్ట్ చేసింది.

మా రాష్ట్రంలోనే ధరలు తక్కువ

సమర్థ మార్కెటింగ్ జోక్యంతో నియంత్రించాం

కేంద్రమే విఫలమైంది: కేరళ సీఎం విజయన్

తిరువనంతపురం : వినియోగదారుల రాష్ట్రంగా ఉన్న కేరళ ద్రవ్యోల్బణాన్ని 'సమర్థవంతమైన మార్కెట్ జోక్యాలతో' అధిగమించిందని, ధరల పెరుగుదల జాతీయ సగటు కంటే తక్కువగా ఉందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ శుక్రవారం అన్నారు. ద్రవ్యోల్బణం రేటు కూడా రాష్ట్రాలలో అత్యల్పంగా ఉందని, దేశవ్యాప్తంగా పెరుగుతున్న ధరలపై ఆందోళనల మధ్య ఆయన తెలిపారు. సప్లైకో ఓనమ్ ఫెస్ట్‌ను ప్రారంభించిన విజయన్ మాట్లాడుతూ సామాన్యులకు 13 నిత్యావసర వస్తువుల ధరలు పెంచబోమని ఎన్నికల వాగ్దానాన్ని నిలబెట్టుకున్నందుకు వామపక్ష ప్రభుత్వం గర్విస్తున్నామన్నారు. ధరలను నియంత్రించడంలో కేంద్రం 'విఫలమైందని' ఆరోపించిన ఆయన, దేశంలోనే అతి తక్కువ ద్రవ్యోల్బణం రేటు కేరళలో ఉందని తెలిపారు. 'రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన మార్కెట్ జోక్యం కారణంగా దేశంలోనే అతి తక్కువ ద్రవ్యోల్బణం రేటు కేరళలో ఉంది. మనది వినియోగదారుల రాష్ట్రం, అందువల్ల ధరల పెరుగుదల సాధారణంగా మన రాష్ట్రంలో కూడా ప్రతిబింబించాలి. కానీ ద్రవ్యోల్బణం రేటును జాతీయ సగటు కంటే చాలా తక్కువగా ఉంచగలిగామని అన్ని గణాంకాలు చూపిస్తున్నాయి' అని విజయన్ అన్నారు. కేరళ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ (సప్లైకో) రాష్ట్రవ్యాప్తంగా ఓనం ఫెయిర్ల నెట్‌వర్క్‌ను ప్రారంభించిన విజయన్... ప్రజలపై భారం పడకుండా ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ధరల పెరుగుదలను అరికట్టడంలో సప్లైకో వైఫల్యం చెందిందంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకున్న వామపక్ష నాయకుడు, స్వార్థ ప్రయోజనాలతో ప్రజలకు తప్పుడు సమాచారం ద్వారా కార్పొరేషన్ ప్రతిష్ఠను దిగజార్చుతున్నారని ఆరోపించారు. గత ఆర్థిక సంవత్సరంలో సప్లైకో రూ.252 కోట్ల టర్నోవర్ నమోదు చేయగా, ఈ ఏడాది రూ.270 కోట్ల టర్నోవర్ నమోదయిందని కార్పొరేషన్‌ను ప్రశంసించారు. గత ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సామాన్యులకు 13 నిత్యావసర వస్తువుల ధరలు పెంచడం లేదని వాగ్దానాలు చేసిన వాటిలో కీలకమైనదని ముఖ్యమంత్రి చెప్పారు. ఇప్పటి వరకు దానికి కట్టుబడి ఉన్నందుకు ప్రభుత్వం గర్విస్తున్నదని అన్నారు. జిల్లా స్థాయి సప్లైకో స్టాళ్లు రేపటి నుంచి, తాలూకా స్థాయి మేళాలు ఆగస్టు 23 నుంచి ఆధునిక సూపర్ మార్కెట్ల తరహాలో సౌకర్యాలతో పనిచేస్తాయని విజయన్ తెలిపారు.

భారత్ ఆదర్శ ప్రయోగశాల: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: పరిష్కారాలను కనుగొనడంలో భారత్ ఆదర్శ ప్రయోగశాల అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఇక్కడ కనుగొన్న పరిష్కారాలను ప్రపంచంలో ఎక్కడైనా అమలు చేయవచ్చని చెప్పారు. జీ20 డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూప్ మంత్రులతో శనివారం బెంగళూరు వేదికగా జరిగిన సమావేశంలో ప్రధాని వర్చువల్‌గా మాట్లాడారు. భారత్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రపంచ సవాళ్లకు సురక్షితమైన, సమగ్ర పరిష్కారాన్ని అందిస్తుందని మోదీ తెలిపారు. భారత్ వైవిధ్యభరితమైన దేశమని, ఎన్నో భాషలు, వందలాది మాండలికాలు ఉన్నాయన్నారు. ఇది ప్రపంచంలోని అన్ని మతాలకు, సాంస్కృతిక పద్ధతులకు నిలయంగా మారిందని చెప్పారు. పురాతన సంప్రదాయాల నుంచి నేటి సాంకేతికత వరకు భారత్ ఎంతో ప్రత్యేకమైనదని, పరిష్కారాలను కనుగొనడంలో భారత్ ఆదర్శవంతమైన ప్రయోగశాల అని పేర్కొన్నారు. త్వరలో ఏఐ పవర్డ్ లాంగ్వేజ్ ట్రాన్స్‌లేషన్ ప్లాట్‌ఫాం 'భాషిణి'ని రూపొందించనున్నామని, దేశంలోని అన్ని భాషలను అనువదించడానికి ఇది ఉపయోగపడుతుందని ప్రధాని వెల్లడించారు. డిజిటల్ ఎకానమీ రంగంలో భారత ప్రభుత్వం చేసిన ప్రయోగాలను ప్రధాని వివరించారు. తన అనుభవాలను ప్రపంచంతో పంచుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. దేశంలోని వివిధ బ్యాంకుల్లో జన్‌ధన్ ఖాతాలు 50 కోట్లకు పైగా ఉన్నాయని, వీటిలో సగానికి పైగా ఖాతాలు మహిళలవే కావడం హర్షణీయమన్నారు. గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో 67 శాతం ఖాతాలు ఉన్నాయని, ఈ ఆర్థిక చేరిక ప్రయోజనాలను దేశంలోని ప్రతిచోటుకు చేరేలా కేంద్రం భరోసా ఇస్తుందని పేర్కొన్నారు.

అదేసమయంలో సురక్షితమైన, నమ్మదగిన, నిలదొక్కుకోగలిగే డిజిటల్ ఎకానమీ కోసం జీ20 అత్యున్నతస్థాయి నిబంధనావళిపై ఏకాభిప్రాయం సాధించడం ముఖ్యమని మోదీ చెప్పారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ భద్రతాపరమైన ముప్పు, సవాళ్లను ఎదుర్కొంటుందని గుర్తుచేశారు. ప్రపంచంలో చౌక ధరలకు లభించే డేటాను భారత దేశంలో 85 కోట్ల మంది ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. జన్ ధన్ బ్యాంకు ఖాతాలు, ఆధార్, మొబైల్ వల్ల వ్యవస్థలో లోపాలను అరికట్టగలుగుతున్నామని చెప్పారు. లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి నగదును అందజేయగలుగుతున్నట్లు తెలిపారు. పన్నుల వ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేయడం వల్ల పారదర్శకత వృద్ధి చెందుతోందని, ఈ-గవర్నెన్స్ జరుగుతోందని తెలిపారు.

సెప్టెంబర్‌లో సీఎం మార్పు: కాంగ్రెస్

ముంబై: మహారాష్ట్రలోని ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం ఎంతో కాలం మనజాలదని, సెప్టెంబర్ కల్లా చాలా మార్పులు చోటుచేసుకుంటాయని అసెంబ్లీలో విపక్ష కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ జోస్యం చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహారాష్ట్రలో ఇప్పటివరకూ జరిగినదేదీ సజావుగా లేదని, ఈ ప్రభుత్వం ఎంతో కాలం ఉండదని ఉన్నారు. సీఎం సీటుకు ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. బీజేపీ, శివసేన, ఎన్‌సీపీ (అజిత్ పవార్ వర్గం) ప్రభుత్వం ఎంతకాలం మనుగడ సాగిస్తుందనే దానిపై కొద్దికాలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రి సీటుకు ముప్పు ఉందనే ఊహాగానాలు వెలువడుతున్నారు. అజిత్ పవార్ తన 8 మంది ఎమ్మెల్యేలతో జూలై 2న మహారాష్ట్ర ప్రభుత్వంలో చేరడం, ఆయన ఉపముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేలంతా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి ఈ ఊహాగానాలు మరింత పెరిగాయి. గత నెలలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ షిండే స్థానంలో అజిత్ పవార్‌ను సీఎం చేస్తున్నారని చెప్పారు. అయితే, ఆయన వాదనను ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తోసిపుచ్చారు. షిండే ప్రభుత్వంలో మార్పులు ఉండవని, ఆయనే సీఎంగా కొనసాగుతారని తెలిపారు. 2022 జులైలో శివసేనలో ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు బావుటా ఎగురవేసి పార్టీని చీల్చడంతో ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని మహా వికాస్ అఘాడి ప్రభుత్వం కుప్పకూలింది. బీజేపీతో షిండే పొత్తు పెట్టుకుని సీఎం పదవి చేపట్టారు.

తిరిగి కాంగ్రెస్ గూటికి జ్యోతిరాదిత్య విధేయుడు

భోపాల్: ఈ ఏడాది చివరిలో మధ్యప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. తాజాగా బీజేపీ నేత, కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి జ్యోతిరాదిత్య సింధియా విధేయుడు సమందర్ పటేల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పటేల్ తన మద్దతుదారులతో కలిసి నీముచ్‌లోని తన స్వస్థలమైన జవాద్ నుండి 800 వాహనాలతో రాష్ట్ర రాజధాని భోపాల్‌లోని పీసీసీ కార్యాలయానికి చేరుకుని ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్‌నాథ్ సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. కమల్‌నాథ్ మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో 2018లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, బీజేపీ నేత శివరాజ్‌సింగ్‌చౌహాన్ ఫిరాయింపులు ప్రోత్సహించి...డబ్బు వెదజల్లి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. శివరాజ్‌సింగ్ పాలనలో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. మహిళలు, రైతులు, యువతపై జరుగుతున్న అఘాయిత్యాల్లో మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రజలు శివరాజ్ సింగ్ ప్రభుత్వానికి వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చే సమందర్ పటేల్ కాంగ్రెస్‌లో చేరినట్లు కమల్‌నాథ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి రావడం తనకెంతో సంతోషంగా ఉందని పటేల్ అన్నారు.

వారణాసిలో ప్రియాంకగాంధీ గెలుపు సాధ్యమే

శివసేన-యూబీటీ ఎంపీ ప్రియాంక

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి బరిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంకగాంధీ వాద్రా పోటీ చేస్తే...విజయం తథ్యమని శివసేన-యూబీటీ ఎంపీ ప్రియాంక చతుర్వేది చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలనే లక్ష్యంతో 26 పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమిలో శివసేన-యూబీటీ భాగస్వామి. ప్రియాంక చతుర్వేది శనివారం మాట్లాడుతూ ప్రియాంక గాంధీ కోరుకుంటే ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి కానీ, వారణాసి నుంచి కానీ పోటీ చేయవచ్చునన్నారు. ఆమె కచ్చితంగా విజయం సాధిస్తారన్నారు. తమ కూటమి పార్టీలు ముందడుగు వేసి పోరాడుతున్నాయన్నారు. తమ కూటమి ప్రభావం, పలుకుబడి పెరుగుతున్నాయనడానికి నిదర్శనం మోదీ పార్లమెంటులోనూ, ఎర్ర కోటపైన తమపై విమర్శలు గుప్పించడమేనని తెలిపారు. బీజేపీయేతర పార్టీలు 26 కలిసికట్టుగా ఉన్నాయని, వాటి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఐక్యంగా పోరాడతారని చెప్పారు. ఈ పోరాటంలో వారి ఓట్లన్నీ కలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. సీట్ల కేటాయింపుపై ఏకాభిప్రాయం గురించి ప్రశ్నించగా...ప్రియాంక చతుర్వేది స్పందిస్తూ సమయం వచ్చినపుడు దీని గురించి వెల్లడిస్తామన్నారు. వారణాసి స్థానానికి ప్రియాంక గాంధీ సరైన అభ్యర్థి అని నిర్ధారణ అయితే శివసేన-యూబీటీ, ఇండియా కూటమి ఆమెను సమర్థిస్తాయన్నారు.

హిమాచల్‌కు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సాయం

సిమ్లా: వర్ష బీభత్సంతో వణుకుతున్న హిమాచల్‌ప్రదేశ్‌కు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు కొండచరియలు విరిగిపడటంతో పెద్దఎత్తున ఆస్తి, ప్రాణనష్టం సంభవించిన విషయం తెలిసిందే. దీంతో తొలుత చత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్ తమ రాష్ట్రం తరపున రూ.11 కోట్లు సాయంగా అందజేయగా.. తాజాగా రాజస్తాన్ ప్రభుత్వం రూ.15 కోట్లు సాయం చేసినట్టు హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు వెల్లడించారు. సీఎం సుఖు శనివారం మీడియాతో మాట్లాడుతూ కష్ట సమయంలో తమకు సాయం చేసిన రాజస్తాన్, చత్తీస్‌గఢ్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విపత్తు సమయంలో హిమాచల్‌ప్రదేశ్ ప్రజలకు విరాళాలు అందజేస్తూ మద్దతుగా నిలుస్తున్నారన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తమకు అందుతున్న సాయం విపత్తు బారిన పడిన బాధిత కుటుంబాలను ఆదుకొనేందుకు ఎంతగానో ఉపయోగపడుతుం దని సీఎం చెప్పారు.

బాధిత ప్రజలకు తగిన సహాయం అందించేందుకు వీలుగా రాష్ట్ర విపత్తు సహాయ నిధికి సాధారణ ప్రజలు, సంస్థలు ఉదారతతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వర్షాకాలంలో ఇప్పటివరకు హిమాచల్‌ప్రదేశ్‌కు దాదాపు రూ.10వేల కోట్ల ఆస్తి నష్టం జరిగినట్టు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపట్టిందని, బాధిత ప్రజలను ఆదుకుంటున్నదని తెలిపారు.

ఏడాదికి ఒక కొత్త మోడల్ కారు: ఎంజీ మోటార్స్

హైదరాబాద్ : దేశీయ మార్కెట్‌లోకి ప్రతి ఏడాది ఒక కారును ప్రవేశపెట్టాలని ఎంజీ మోటార్స్ ఇండియా ప్రణాళికలు రూపొందుతోంది. దీంతో పాటు విద్యుత్ కార్ల అమ్మకాలు పెంచుకోవాలని భావిస్తోంది. వివిధ టెక్నాలజీ ఎలక్ట్రిక్ కార్లపై దృష్టి సారించనున్నట్లు సంస్థ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ గుప్తా తెలిపారు.

హైదరాబాద్‌లో కొత్తగా కూకట్‌పల్లి, ఎల్‌బీ నగర్‌లలో డీలర్‌షిప్‌లను ప్రారంభించిన సందర్భంగా గుప్తా మాట్లాడుతూ, ఈ ఏడాదిలో కంపెనీ మొత్తం కార్ల విక్రయాల్లో ఎలక్ట్రిక్ కార్ల వాటా 25 శాతం ఉండగలదని అంచనా వేస్తున్నామని , జూన్,జులై నెలల్లో మొత్తం విక్రయాల్లో ఈ కార్ల వాటా 30 శాతం ఉందని చెప్పారు. కంపెనీ విక్రయిస్తున్న మొత్తం కార్లలో తెలుగు రాష్ట్రాల వాటా 7 శాతం ఉంది.

టైటాన్ చేతికి క్యారట్‌లెన్ వాటా

న్యూఢిల్లీ : క్యారట్‌లెన్‌లో అదనంగా 27.1 శాతం వాటాను రూ.4,621 కు కొనుగోలు చేయనున్నట్లు టైటాన్ కంపెనీ లిమిటెడ్ శనివారం ప్రకటించింది. ఈ ఒప్పందం పూర్తయిన తర్వాత ఆభరణాల తయారీ, విక్రయంలో అగ్రగామిగా ఉన్న క్యారట్‌లెన్‌లో టైటాన్ 98.28 శాతం ఈక్విటీని కలిగి ఉంటుంది. 2016లో టైటాన్ మొదటిసారిగా క్యారట్‌లెన్‌లో పెట్టుబడి పెట్టింది. కంపెనీలో దాదాపు 71 శాతం వాటా ఉంది. టైటాన్... క్యారట్‌లెన్ వ్యవస్థాపకుడు మిథున్ సచేతి, అతని కుటుంబం నుంచి అదనపు వాటాను కొనుగోలు చేయనుంది. ఆకర్షణీయమైన... నాణ్యమైన ఆభరణాలను అందుబాటులోకి తీసుకురావాలని కలలు కని, 15 ఏళ్లలో క్యారట్‌లెన్‌లో సమిష్టిగా సాధించిన విజయాన్ని గురించి గర్వపడుతున్నానని సచేతి అన్నారు. భవిష్యత్తును పరిశీలిస్తే, క్యారెట్‌లెన్‌కు టైటాన్, ప్రతిష్ఠాత్మకమైన టాటా గ్రూప్ కంటే క్యారట్‌లెన్ మరింత ఆదర్శవంతమైన గమ్యస్థానం మరొకటి ఉండదని అన్నారు. ఇది క్యారట్‌లెన్‌కు శక్తి నుంచి శక్తికి ఎదగడానికి సరైన అవకాశాలను అందిస్తోందని సచేతి వ్యాఖ్యానించారు. టైటాన్ మేనేజింగ్ డైరెక్టర్ సీకే వెంకటరామన్ మాట్లాడుతూ, టైటాన్ ఎప్పుడూ బలమైన బ్రాండ్‌లను నిర్మించడంలో గర్విస్తుందన్నారు. భారతదేశ వినియోగదారుల అభిప్రాయాలపై తమకు గొప్ప నమ్మకం ఉందని, క్యారట్‌లెన్ వృద్ధి ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది. ఇది సుదీర్ఘకాలం ఉంటుందని నమ్ముతున్నామని తెలిపారు. టాటా గ్రూప్ లోని తాము గర్వించదగిన కస్టమర్-సెంట్రిక్ బ్రాండ్‌ను సంయుక్తంగా నిర్మించినందుకు మిథున్ సచేతికి తాము కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. 2023 అక్టోబరు 31 నాటికి ఈ ఒప్పందం పూర్తవుతోందని అంచనా. క్యారట్‌లెన్ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2,177 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేసింది.

ఎక్స్‌యూవీ 700లో లోపాలు... లక్ష వాహనాల రీకాల్



న్యూఢిల్లీ : ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా భారీ సంఖ్యలో వాహనాలను రీకాల్ చేస్తోంది. ఎక్స్‌యూవీ 700 మోడల్‌కు చెందిన లక్ష యూనిట్లను వెనక్కి రప్పిస్తుంది. వాహనంలో వైరింగ్‌లో లోపాలు గుర్తించామని, తగు మార్పులు చేసి వినియోగదారులకు తిరిగి అప్పగిస్తామని తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ పేర్కొంది. 2012 జూన్ 8 నుంచి 2023 జూన్ 28 మధ్య తయారైన 1,08,306 యూనిట్ల కార్లలోని ఇంజన్ బేలో వైరింగ్ లూమ్ రూటింగ్‌లోని లోపాల కారణంగా సమస్యలు తలెత్తే అవకాశాలున్నట్లు గుర్తించామని మహీంద్రా సంస్థ తెలిపింది. దీంతో పాటు కొన్ని ఎక్స్‌యూవీ 400 ఎస్‌యూవీలను కూడా రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. 2023 ఫిబ్రవరి 16 నుంచి 2023 జూన్ 5 మధ్య తయారైన 3,560 యూనిట్లను వెనక్కి రప్పిస్తున్నట్లు మహీంద్రా పేర్కొంది. ఎక్స్‌యూవీ 400 వాహనాల్లో బ్రేక్ పొటెన్షియో మీటర్‌లో స్ప్రింగ్ రిటర్న్ యాక్షన్‌లో లోపాలు ఉండే అవకాశం ఉందని పేర్కొంది.

దీంతో ఈ కార్లు కొనుగోలు చేసిన కస్టమర్లకు ఎలాంటి రుసుమూ లేకుండానే మరమ్మతులు చేసి ఇస్తామని పేర్కొంది. స్వచ్ఛందంగానే రీకాల్ చేపడుతున్నామని, కార్ల యజమానులకు వ్యక్తిగతంగానూ సమాచారం అందుతుందని పేర్కొంది. ఇటీవల మారుతీ సుజుకీ ఇండియా కూడా పెద్ద ఎత్తున కార్లను రీకాల్ చేసింది. తన ఎస్-ప్రెస్సో, ఈకో మోడళ్లకు చెందిన 87,599 యూనిట్ల వాహనాలను వెనక్కి రప్పించింది. స్టీరింగ్ టై రాడ్‌లో లోపాన్ని సరిచేయడానికి ఈ రీకాల్‌ను సంస్థ చేపట్టింది.

సుజల స్రవంతితోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

- రివర్స్ గేర్ ప్రభుత్వంతో రాష్ట్రం అధోగతి
- మోదీది సీబీఐ రాజ్యం... జగన్‌ది పోలీసు రాజ్యం
- రాజకీయాలకతీతంగా అన్నిపక్షాలు ఏకం కావాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

బస్సు యాత్ర నేటి షెడ్యూల్

అల్లూరి సీతారామరాజు జిల్లా కేడీ పేటలో అల్లూరి స్మారక స్థలం సందర్శన

చింతపల్లిలో గిరిజన సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాధించకుండా ఉత్తరాంధ్ర అభివృద్ధి జరగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. 'రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' నినాదంతో ప్రారంభమైన బస్సు యాత్ర శనివారం అనకాపల్లి చేరుకుంది. జిల్లా కేంద్రంలో గల సుంకరమెట్ట జంక్షన్ వద్ద నుంచి బస్సు యాత్రకు పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా స్థానిక రోటరీ క్లబ్ సమావేశ మందిరం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తమదైన శైలిలో పాటలు ఆలపించారు. పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సదస్సును ఉద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ దేశాన్ని మోదీ, రాష్ట్రాన్ని జగన్‌మోహన్ రెడ్డి సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్‌ది పోలీసు రాజ్యం అయితే, మోదీది సీబీఐ రాజ్యమని అన్నారు. గట్టిగా ప్రశ్నించిన వారిని జగన్ పోలీసులతో భయపెడితే, మోదీ సీబీఐతో భయపెడుతూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అసెంబ్లీని సైతం వైసీపీ మంత్రులు నవ్వుల పాలు చేస్తున్నార న్నారు. అసెంబ్లీ సాక్షిగా బూతులు తిట్టుకుంటూ, రాజకీయాలకు సంబంధం లేని నాయకుల భార్యలను సైతం తమ స్వార్థ రాజకీయాల కోసం ఉపయోగించుకుంటు న్నారని అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తయితే 8 లక్షల ఎకరాలకు సాగు నీరు, 30 లక్షల జనాభా కలిగిన 12 గ్రామాలకు తాగు నీరు, విశాఖ పారిశ్రామిక వాడకు 5.34 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. తాగు, సాగు నీరు లేకుండా అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ మూలన పడ్డాయన్నారు. అభివృద్ధి చేయకుండా రుషికొండను కొల్లగొడుతున్నారని విమర్శించారు. ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్న మోసగాడు జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. 41.54 ఎత్తుగల పోలవరం ప్రాజెక్టును 41 మీటర్ల ఎత్తు తగ్గిస్తే ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నీరు వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేయడానికి జగన్ ప్రయత్నిస్తున్నాడని, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశాంతంగా ఉద్యమాలు చేసుకునే పరిస్థితి కూడా లేదని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా కచ్చితంగా అన్ని పార్టీలు నడుం బిగించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. సెప్టెంబరు 8న తిరుపతిలో జరిగే సభకు వేలాదిగా తరలివచ్చి ప్రభుత్వంపై వ్యతిరేకతను చూపించాలన్నారు. మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో 71 శాతం పోలవరం పూర్తి చేశామని, అయితే జగన్ రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరాన్ని నాశనం చేశాడని ఆరోపించారు. సుజల స్రవంతి పూర్తయితే ఉత్తరాంధ్రకు తాగు, సాగు నీరు పుష్కలంగా అందుతుందన్నారు. విశాఖలో వైసీపీ చేసిన 12 కుంభకోణాలను బయటికి తీస్తే కనీసం స్పందించలేదన్నారు. జిల్లాలో అవగాహన లేని కోడిగుడ్డు మంత్రి ఉన్నాడని, ఏం మాట్లాడతాడో ఆయనకే తెలియదన్నారు. సీపీఐ చేసే ఈ బస్సు యాత్ర ద్వారా అయినా జగన్‌మోహన్ రెడ్డికి ఆ దేవుడు మంచి బుద్ధిని ప్రసాదించాలని అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రజా వ్యతిరేక, దివాళాకోరు ఆర్థిక విధానాలు అవలంభిస్తున్నారని మండిపడ్డారు. తినను తిననివ్వను, ఆడపిల్లలకు రక్షణ కల్పిస్తానంటూ ప్రగల్భాలు పలికే మోదీ వాటిని అమలు చేయకుండా మతోన్మాదంతో దేశంలో అరాచక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. మణిపూర్‌లో జరిగిన హింసకాండపై రెండున్నర నెలల తర్వాత మోదీ స్పందించడం ఆయన వైఖరికి అద్దం పడుతుందన్నారు. దేశవ్యాప్తంగా భారత సమాజాన్ని రక్షించుకోవాలనే నినాదంతో ప్రచార ఆందోళనలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి బటన్ నొక్కడం తప్ప ఇంకేమీ తెలియదన్నారు. అభివృద్ధి పేరుతో కాలుష్య పరిశ్రమలు ఉత్తరాంధ్రలో నెలకొల్పుతున్నారని విమర్శించారు. ఈ సదస్సులో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పార్టీ కంట్రోల్ కమిటీ చైర్మన్ కామేశ్వరరావు, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు శంకర్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్సన్ బాబు, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు ఈ.విమల, సీపీఐ విశాఖ అర్బన్ కార్యదర్శి ఎం.పైడిరాజు, సీపీఎం కార్పొరేటర్ గంగారాం, సీపీఐ అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి రాజన దొరబాబు, మాకిరెడ్డి రామనాయుడు, జిల్లా సమితి సభ్యులు కె.సన్యాసిరావు, రైతు సంఘం నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, సీపీఐ నాయకులు వై.ఎన్.భద్రం, కోరుబిల్లి శంకర్రావు, తాకాసి వెంకటేశ్వరరావు, యువజన నాయకులు వియ్యపు రాజు, వేముల కన్నబాబు, జి.ఫణీంద్ర, బాబ్జి, సతీష్ పాల్గొన్నారు.

నిర్వాసితుల పరిస్థితి దయనీయం

మణిపూర్ గవర్నర్‌తో సీపీఎం బృందం భేటీ

ఇంఫాల్: మణిపూర్‌లో పరిస్థితిపై చర్చించేందుకు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఇక్కడి రాజ్‌భవన్‌లో ఆ రాష్ట్ర గవర్నర్ అనుసూయా ఉకేని కలిసింది. ప్రస్తుతం వివిధ సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్న అంతర్గత నిర్వాసితుల (ఐడీపీ) పరిస్థితిపై చర్చించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎం బృందం శుక్రవారం చురాచంద్‌పూర్, మోయిరాంగ్‌లలోని సహాయక శిబిరాలను సందర్శించిందని, 'సహాయక శిబిరాలను నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక సంస్థలు చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా లేవని గుర్తించినట్లు ఉకేకి ఏచూరి వివరించారు' అని గవర్నర్ సచివాలయం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. రాజ్యసభ మాజీ సభ్యుడు కూడా అయిన ఏచూరి మాట్లాడుతూ ఐడీపీల్లో ముఖ్యంగా పిల్లలు, పాలిచ్చే తల్లులకు పౌష్టికాహారం అందడం లేదు. శిబిరాల్లో శిశువులు జన్మిస్తున్నారు' అని తెలిపారు. 'అటువంటి పరిస్థితిలో ఆశతో ఎంతకాలం జీవించగలరు?' అని ఆయన ప్రశ్నించారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం ఈ బృందం శుక్రవారం మణిపూర్‌కు చేరుకుంది. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభానికి రాజకీయ పరిష్కారం మాత్రమే శాంతిని చేకూరుస్తుందని, అదే సమయంలో వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి ఆయుధాలు దోచుకోవడంపై ఏచూరి ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, రాజకీయ పార్టీలు, పార్టీ శ్రేణులకు అతీతంగా కొనసాగుతున్న సంఘర్షణకు సామరస్యపూర్వక పరిష్కారాన్ని తీసుకురావడంలో ప్రభుత్వంతో సహకరించాల్సిన అవసరం ఉందని గవర్నర్ ఉకే ఈ సందర్భంగా సీపీఎం ప్రతినిధి బృందానికి తెలిపారు. 'హింస ఎటువంటి పరిష్కారాన్ని తీసుకురాదు' అని ఉకే వ్యాఖ్యానించారు. హింసను విస్మరించి చర్చలకు ముందుకు రావాలని రెండు వర్గాలకు విజ్ఞప్తి చేశామని అన్నారు. తాను స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీని, ఇతర కేంద్ర నేతలను కలిశానని, వీలైనంత త్వరగా వివాదానికి ముగింపు పలికేందుకు మార్గాలను అన్వేషించాలని కోరినట్లు గవర్నర్ సీపీఎం బృందానికి తెలిపారు.

సోషల్ మీడియాలో జాగ్రత్త ఉండాలి

సుప్రీం కోర్టు హెచ్చరిక

న్యూఢిల్లీ : సోషల్ మీడియా వినియోగదారులు దాని ప్రభావం, చేరిక గురించి జాగ్రత్తగా ఉండాలని సుప్రీం కోర్టు హెచ్చరించింది. మహిళా జర్నలిస్టులపై అవమానకరమైన వ్యాఖ్యలతో కూడిన ఫేస్‌బుక్ పోస్ట్‌ను 2018లో షేర్ చేసినందుకు కేసులు ఎదుర్కొంటున్న సినీ నటుడు, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.శేఖర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసినట్లు పీటీఐ నివేదించింది. తాను షేర్ చేసిన పోస్ట్‌కు సంబంధించిన నేర విచారణను రద్దు చేయాలంటూ తన పిటిషన్‌ను కొట్టివేసిన మద్రాస్ హైకోర్టు జులై 14న ఇచ్చిన ఉత్తర్వులపై శేఖర్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తులు బి.ఆర్.గవాయ్, పి.కె.మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారించింది. 'ఒకవేళ ఎవరైనా సోషల్ మీడియాను ఉపయోగిస్తే, దాని ప్రభావం, చేరిక గురించి మరింత జాగ్రత్తగా ఉండాలి' అని పిటిషనర్ తరపు న్యాయవాదికి ధర్మాసనం తెలిపింది. కాగా, సంఘటన జరిగిన తేదీన శేఖర్ తన కళ్లలో కొంత మందు వేసుకున్నాడని, అందుకే తాను షేర్ చేసిన పోస్ట్‌లోని విషయాలను చదవలేకపోయాడని న్యాయవాది వాదించాడు. సోషల్ మీడియాను ఉపయోగించడం తప్పనిసరి అని ఎవరైనా భావిస్తే, దాని పర్యవసానాలను కూడా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొంది. శేఖర్ ఏప్రిల్ 19, 2018న 'తన ఫేస్‌బుక్ ఖాతాలో దుర్వినియోగమైన, అవమానకరమైన, అసభ్యకరమైన వ్యాఖ్యను ప్రచురించడం, వ్యాప్తి చేయడం చేశాడు' అని హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆ తర్వాత చెన్నై కమిషనర్ ఆఫ్ పోలీస్‌కు ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, తమిళనాడులోని అనేక ప్రాంతాల్లో అతనిపై ఇతర ప్రైవేట్ ఫిర్యాదులు కూడా నమోదయ్యాయని పేర్కొంది. హైకోర్టు ముందు, శేఖర్ తరపు న్యాయవాది తనకు పంపిన సందేశంలోని విషయాలు అతనికి తెలియవని, కేవలం తన ఫేస్‌బుక్ ఖాతా నుంచి ఫార్వార్డ్ చేశాడని వాదించినట్లు పీటీఐ పేర్కొంది. సోషల్ మీడియా సందేశంలో అవమానకరమైన వ్యాఖ్యల గురించి తెలుసుకున్న తర్వాత, శేఖర్ అదే రోజు రెండు గంటల్లో ఆ సందేశాన్ని తొలగించి, దానిని అనుసరించి ఏప్రిల్ 20, 2018 నాటి లేఖతో బేషరతుగా క్షమాపణ చెప్పాడని అతని తరపు న్యాయవాది చెప్పారు. సంబంధిత మహిళా జర్నలిస్టులకు, మీడియాకు క్షమాపణలు చెప్పారని అన్నారు.

తక్షణమే లబ్ధిదారులకు టిడ్కో గృహాలు

రామకృష్ణ డిమాండ్

సీఎం జగన్‌కు రామకృష్ణ సెల్ఫీ చాలెంజ్

'రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' నినాదంతో సీపీఐ చేపట్టిన బస్సు యాత్రలో భాగంగా అనకా పల్లి జిల్లా నర్సీపట్నంలో గల టిడ్కో గృహ సముదా యాన్ని పార్టీ శ్రేణులతో కలిసి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి సెల్ఫీ చాలెంజ్ విసిరారు. 'టిడ్కో ఇళ్లను కేటాయించడానికి మీకు ఎంత సమయం పడుతుంది. మీరు దీన్ని చేయలేక పోతే, పదవి నుంచి తప్పుకోవడం మంచిది' అంటూ టిడ్కో గృహాల దగ్గర సెల్ఫీ దిగారు.

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి (నర్సీపట్నం): టిడ్కో గృహాలను తక్షణమే లబ్ధిదారులకు అందజేయాలని, జగనన్న గృహ నిర్మాణాలకు రూ.5లక్షలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ బస్సు యాత్రలో భాగంగా అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని టిడ్కో గృహాలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో రామకృష్ణ మాట్లాడుతూ టీడీపీ హయాంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న టిడ్కో గృహాలను ఇప్పటివరకు లబ్ధిదారుకుల ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారుల నుంచి డీడీలు కూడా తీసుకున్నా రని గుర్తుచేశారు. తమకు అనుకూలంగా లేని వారిని టిడ్కో గృహాల లబ్ధిదారుల జాబితా నుంచి వైసీపీ ప్రభుత్వం తొలగించిందని విమర్శించారు. లబ్ధిదారుల జాబితాలో లేనివారికీ ఈఎంఐలు చెల్లించమని నోటీసులు ఇస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం అస్తవ్యస్త నిర్ణయాలతో ప్రజలను గందరగోళం పెడుతోందని విమర్శించారు. టిడ్కో గృహాల పంపిణీ చేపట్టని అసమర్థ పాలన రాష్ట్రంలో ఉందన్నారు. టిడ్కో గృహ సముదాయాలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు తక్షణమే అందజేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలలో గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు కేటాయించి వాటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. జగనన్న గృహాల నిర్మాణానికి ఇస్తున్న లక్షా80 వేల రూపాయలు ఏమాత్రం సరిపోవని అన్నారు. రామకృష్ణ వెంట సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, పార్టీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామనాయుడు, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వా హక అధ్యక్షురాలు విమల, నర్సీపట్నం పట్టణ కార్యదర్శి గురుబాబు, రూరల్ కార్యదర్శి శ్రీరామ్‌మూర్తి ఉన్నారు.

లోయలో ఆర్మీ వాహనం బోల్తా

తొమ్మిది మంది జవాన్లు మృతి

లేహ్: లధక్‌లోని లేహ్ జిల్లాలో ఆర్మీ వాహనం ప్రమాదానికి గురైంది. వాహనం అదుపు తప్పి లోయలో పడిపోగా తొమ్మిది మంది చనిపోయారు. మరొకరికి గాయాలయ్యాయి. దక్షిణ లధక్ నియోమా వద్ద శనివారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగినట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

నాణ్యతకు సాటి లలిత జ్యువెలరీ

కర్నూలులో 51వ షోరూమ్ ప్రారంభోత్సవంలో చైర్మన్ కిరణ్‌కుమార్

విశాలాంధ్ర- కర్నూల్ సిటీ: తక్కువ ధర, నాణ్యమైన స్వర్ణాభరణాలకు నిలయం లలిత జ్యువెలరీ అని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.కిరణ్ కుమార్ తెలిపారు. తయారీ ధరకే బంగారం, వజ్రాభరణాలు అందిస్తున్నట్లు చెప్పారు. శనివారం కర్నూలు, షార్క్‌రోడ్డులో 51వ లలితా జ్యువెలరీ షోరూమ్ ప్రారంభమైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు డబ్బు ఆదా చేయడం కోసం సరికొత్త బంగారు నగల కొనుగోలు పథకాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లో లలిత జ్యువెలరీకి అమితాదరణ ఉందని చెప్పారు. దక్షిణ భారతంలో అగ్రగామిగా లలిత జ్యువెలరీకి గుర్తింపు వచ్చిందన్నారు. కర్నూలు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం నగరంలో కొత్త షోరూమ్‌ను ప్రారంభిం చినట్లు తెలిపారు. ధనవందనం పేరుతో 11 నెలల నగలు కొనుగోలు పథకాన్ని ప్రారంభించామన్నారు. నెలనెలా కట్టే డబ్బుతో బంగారాన్ని కొనవచ్చు లేక నగదు రూపేణ ఆదా చేసుకోవచ్చన్నారు. ఏ నగ అయినా 50శాతం తరుగు ఉండదని, ఒక నెల కిస్తీలో 50శాతం బోనస్ ఉంటుందన్నారు. విస్తృతమైన కలెక్షన్లు తమ ప్రత్యేకతలని తెలిపారు. గొలుసులు, గాజులు, హారాలు, కాంతాభరణాలు, ఒడ్డాణం, ఉంగరాలు, కమ్మలు, జుమ్మిలతోపాటు రకరకాల నగలు కొత్త షోరూమ్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.